POSTAL REGD.NO.PRAKASAM/16/2021-2023
REGD.NO. 37926/83
ESTABLISHED : 1983
మే 2022
వెల – ₹ 10.00

సాయిబాబా

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక
సంపుటి: 40 సంచిక: 01



శ్రీశ్రీశ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామి జయంతి (20-5-2022)

పూజ్యశ్రీ అలివేలు మంగమ్మ తల్లి ఆరాధనోత్సవము తిథుల ప్రకారం మే 24, 2022 న మరియు ఆంగ్ల కాలమాన ప్రకారం జూన్ 3, 2022 న గుమ్మళంపాడు మాతృదేవి దివ్య సన్నిధిలో జరుగును. ఉత్సవాలకు సంబంధించి మరిన్ని వివరములకు శ్రీ పి.రమేష్ గారిని (9440018038), శ్రీ టి.వి.రావుగారిని (9063334964) సంప్రదించగలరు.

పవిత్ర మత గ్రంథాల పుట్టుపూర్వోత్తరాలేమిటి?

పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

ప్రపంచంలోని సర్వమత గ్రంథాలు తాము కొందరు మహాత్ముల దివ్యానుభవాల నుండి ఉత్పన్నమయినట్లు చెబుతాయి. "ఖురాన్" మహమ్మదుగారికి కల్గిన దివ్యావేశంలో దైవమే ఆయన నోటి ద్వారా మాట్లాడినట్లు చెప్పబడినట్లు వుంది. తన దేశంలోనూ, సాటి దేశాలలోను విగ్రహారాధన, క్రైస్తవులలోని చీలికలు, తగవులు, మానవులలోని కుచ్ఛితాలు చూచి ఆయనకు ఏవగింపు కలిగి నిర్దుష్టమైన సత్యాన్ని తెలుసుకోడానికి ఈయన హీరాపర్వత గుహలో నెలలు, సంవత్సరాల పర్యంతం ప్రార్థన ధ్యానాలలో కాలం గడిపారు. మొదట ఆయనకు స్వప్నాలు కలిగాయి. క్రమంగా స్వప్నంలో కన్పించిన ప్రతిదీ వాస్తవం కాజొచ్చింది. చివరికొకరోజున పెద్ద వెలుగు ఆయన హృదయంలో నిలిచి, ఆయన ప్రవక్తయనీ, నూత్నమార్గాన్ని మానవాళికి బోధించాలనీ ఆదేశించింది. ఆ మాటలు విన్న ఆయన ఎంతో భయంతో వణుకుతూ ఇల్లు చేరారు. ఆయన భార్య ఖదీజా 'ఆయన పవిత్రంగా జీవితాన్ని గడుపుతున్నారు గనుక దైవం ఎన్నడూ ఆయననలా వంచించరు' అని వూరడించింది. చాలా కాలం ఏదో దుష్టశక్తి తననలా తిరుగుబాటుకు కల్లోలానికీ ప్రేరేపిస్తోందని తలచారు. ఒకనాడు ఆ వాణి ఆయనను, "పఠించు" అని ఆదేశించింది. "నాకు చదువురాదు" అన్నారాయన. భగవంతుడు ఆయనకు అద్భుతరీతిన చదువుగల సామర్థ్యాన్నిస్తారని వినిపించింది. తర్వాత ఒకసారి ఆ వాణి, "నీవు ప్రవక్తవు. నేను జిబ్రాయిల్‌ను" అని చెప్పింది. నిరక్షరుడైన మహమ్మదుల ద్వారా ధారాళంగా ప్రకటమైన 'ఖురాన్' లోని వాక్యాలవంటి వాటిని అరబ్బీలో ఆరితేరిన పండితులు సైతం వ్రాయలేరట! ఈ అనుభవమే ఇస్లాముకు మూలము.

క్రైస్తవంలో పాతగ్రంథమంతా తమ జీవితాలు ధ్యాన తపస్సులలో గడిపిన ప్రవక్తలమూలానే మోసెట్ గారికి గూడా పర్వతం మీద తేజోరూపంలో దేవుడు దర్శనమిచ్చి పది ధర్మాలు బోధించారు. ఆ దర్శనానంతరం ఆయన ముఖంలో జనులు చూచి భయపడేటంతటి కాంతి ప్రకటమయ్యేదట. ఆయనలో ఎన్నో మహిమలు గూడా ప్రకటమయ్యాయట అలానే క్రీస్తు యొక్క అద్భుత జననము, మహిమలవలన ఆయన మతము ఉత్పన్నమైంది.

సిద్ధార్థుడు దుఃఖానికీ, మరణానికీ కారణాన్ని అన్వేషించడానికి రాజ్యాన్నీ, చివరకు భార్యబిడ్డలను గూడా విడచి భిక్షువై ఘోర తపస్సులు చేసి చివరకు బోధివృక్షం క్రింద జ్ఞానోదయమై బుద్ధుడైనాడు. ఆ అనుభవసారమే బౌద్ధమతము.

ఇంకా ప్రాచీన యుగాలలో తపస్వులైన మహర్షులకు తపస్సు ఫలితంగా యోగస్థితిలో వేదములు ప్రకటమై వారి ద్వారా వేదాలు

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక

సాయిబాబా

OFFICIAL ORGAN OF SRI MANGA BHARADWAJA TRUST

సంపుటి:40 మే-2022 సంచిక:01

పరమపూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారిచే స్థాపించబడిన ఏకైక పత్రిక, మన 'సాయిబాబా'

విషయ సూచిక

01.	పవిత్రమత గ్రంథాల పుట్టుపూర్వోత్తరాలేమిటి?	పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ	03
02.	పరిప్రశ్న	పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ	06
03.	దివ్యజనని ఉగాది సందేశము	పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ	07
04.	సిద్ధయ్య	శ్రీమతి శ్రీదేవి	10
05.	మాతృదేవి మహాసమాధి	శ్రీమతి T.పద్మావతి	14
06.	వార్తాలాపము	శ్రీమతి అడిదం వేదవతి	16
07.	మాతృదేవి స్మృతులు	శ్రీమతి కమలా రామచందర్	17
08.	మార్గదర్శి	శ్రీ సూర్యప్రకాష్	19
09.	రాధాకృష్ణ ఆయీ	పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ	21
10.	స్వామికి మొక్కిన మొక్కు	తంజావూరు సంతానరామన్	23
11.	ద్వారకామాయి అనుభవమండపము	శ్రీ వి. శేషగిరిరావు	25
12.	ఆచార్యుని అద్భుత లీలలు	శ్రీమతి సరోజిని	27

చిరునామా

Sri Manga Bharadwaja Trust,
Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar,
Jaipuri Colony, Nagole, Hyderabad - 500068
Phone No. +91 - 74160 41550

www.saibharadwaja.org
www.saimasterforums.org

చీఫ్ ఎడిటర్: డా॥ ఆర్.ఎస్. శశిధర్, పిహెచ్. డి

చందా వివరములు

విడి ప్రతి	:	రూ. 10-00
సంవత్సర చందా	:	రూ. 100-00

సాయిబాబా పత్రికలో వెలువడే వ్యాసాలకు, అభిప్రాయాలకు ఆయా రచయితలే బాధ్యులు.

వెల్లడైనాయి.

ఈ పవిత్ర గ్రంథాలన్నీ దివ్యానుభవాలవల్ల ఉత్పన్న మైనాయని విశ్వసించడమెలా? ఇప్పటికీ ఇటువంటి అనుభవాలను పొందిన మహనీయులు రామకృష్ణ పరమహంస, రమణ మహర్షుల వంటివారి అనుభవాలే! 30 డిసెంబరు 1879లో తిరుచ్చుళిలో జన్మించిన వెంకట్రామన్ తమ 16వ సం॥లో ఒకరోజున ఆకస్మికంగా మరణానుభవాన్ని పొందారు. సహాయానికెవర్నీ పిలిచే సమయం లేనందున మరణించడమంటే ఏమి జరుగుతుందో గమనిస్తూ వుండిపోయారు. శరీరం కొయ్యబారడం, గుండె, శ్వాస ఆగడం గూడ గమనించి, "శరీరం మరణించినా గూడా ఆ విషయాన్ని గుర్తించే గుర్తింపు వున్నదే!" అని ఆశ్చర్యబోయి, మరణించేది శరీరమేననీ, నిజానికి అది తన మరణం గాదనీ, కేవలం జనన మరణ రహితమైన చైతన్యమేననీ స్వానుభావంతో గ్రహించారు. తరువాత ఆయనయత్నం లేకనే ఆయన అరుణాచలంలో కొన్ని సంవత్సరాలు దేహాన్ని మరచి తపస్సులో వుండిపోయారు. తరువాత నిరక్షరుడైన ఒక సాధువుకు పుస్తకం చదివి పెట్టాలన్న సంకల్పంతో ఆయన అతడు తెచ్చుకున్న వేదాంత గ్రంథాలను చూచారు. సరిగ్గా తమకు కలిగిన అనుభవాలే వాటిల్లో వర్ణించబడి వుండడం ఆయననెంతో ముగ్ధుణ్ని చేసింది. వేదాంతపఠనము; సాధన భక్తిలేని వెంకట్రామన్‌కు స్వానుభవంతో ఉపనిషత్తత్వం ప్రకటం గావడం ఉపనిషత్తులటువంటి అనుభవాల ఫలితాలేనని ఋజువు కాలేదూ? ఆయనను దర్శించిన పాశ్చాత్యులు కూడా, ఆయన సన్నిధిలో పరమశాంతిని పొందారు. ఆయనను క్రీస్తుతో పోల్చారు, జంతువులు సైతం ఆయన సన్నిధిలో విశేషప్రజ్ఞతో మెలిగేవి.

వీరి శిష్యులలో మహాపండితుడు, యోగి అయిన 'కావ్యకంఠ' వాశిష్ఠ గణపతి యొకరు. ఆయనకు దైవరాతుడను శిష్యుడున్నారు. ఆయన యోగస్థితిలో నిమగ్నులై వున్నప్పుడు ఆయన నోటివెంట అప్రయత్నముగా ఎరుకలేకనే వేదమంత్రాలవంటివి వినవచ్చేవి. సాటివారు వాటిని వ్రాసుకున్నారు. అవి స్వరంలోనూ, పదజాలంలోనూ, ఛందస్సులోను, వ్యాకరణంలోను, భావగాంభీర్యంలోను వేదమంత్రాలను పోలివుండడం మన దేశీయవేద పండితులనే గాక, జర్మనీలోని వేద పరిశోధకులను గూడా ఆశ్చర్యచకితులను చేసేవి. అయితే అవి ఇంతవరకూ మనకు సాంప్రదాయకంగా వచ్చిన వేదాలలోవికావు! వాటి అర్థం గూడా దైవరాతులకు ఆయన గురువైన కావ్యకంఠులు వివరించి చెప్పవలసి వచ్చింది. ఇటీవల భారతీయ విద్యాభవన్ వారు 'ఛందోదర్శనము' అనుబృహద్గ్రంథంగా దానిని ప్రచురించారు. జర్మన్ వేదపండితుల ప్రశంసలు గూడా తొలిపలుకులలో ప్రచురించబడ్డాయి.

ఇటువంటి మరొక్క అనుభవం : ఇటీవలి వరకు మనమధ్య 'ఆనందమయి మాత'గా ప్రసిద్ధిచెందిన అమ్మ విద్యలేని సాంప్రదాయికమైన గృహిణి. కాని ఆమెకు దివ్యానుభవాలు అవంతటవే కలిగేవి. ఆమె అప్రయత్నంగా ధ్యాననిమగ్నురాలు కావడం, అప్పుడామెనోటివెంట స్వచ్ఛమైన వేదమంత్రాలవంటి మంత్రాలు సస్వరంగా వెల్లడి గావడం ఆ సమయంలో ఆమె వర్చస్సు అలౌకికమైన కాంతితో వెలిగిపోవడమూ భక్తులనాశ్చర్యపరచేదని ఆమెను కొన్ని దశాబ్దాలు సేవించిన జ్యోతిష్ చంద్ర రే 'Mother as Revealed to me' అనే గ్రంథంలో వ్రాశారు.

ఇటువంటి దివ్యానుభవాలు వివిధ దేశాలలో ఎందరకో కలిగినట్లు విలియమ్ జేమ్స్ "Varieties of Religious experiences" అను గ్రంథంలోనూ, ఎవలిన్ అండర్హిల్ "Mysticis" అను గ్రంథంలోనూ, మాడమ్ బ్లావెట్స్కీ "Secret Doctrine" లోనూ వ్రాశారు. ఇన్ని దేశకాల మతాలవారికి ఒకేరకమైన అద్భుతానుభూతులు కలగడం ఆధ్యాత్మికానుభూతి నిజమని చెప్పడానికాధారమని సోమర్సెట్ మామ్ అను ప్రఖ్యాత ఆంగ్ల రచయిత అంటారు. ఆల్డస్ హాక్స్లీ "Perennial Philosophy" లో గూడా అదే భావాన్ని వ్యక్తం చేశారు.●



పరిప్రశ్న

పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

ప్రశ్న:- "శ్రీపాదవల్లభ దిగంబరా!" అన్నట్లే భక్తులు "సాయి దిగంబరా" అంటున్నారు. దిగంబరా అంటున్న నామం ఎవరికి వర్తిస్తుంది? సాయి దిగంబరుడెలా అయ్యాడు?

- సుధామయి, విజయవాడ

జవాబు:- దిగంబరుడంటే, 'దిక్కులే వస్త్రాలుగా గలవాడు' అని అర్థము. దీనికి పామరులు వస్త్రాలు ధరించనివాడు అని అర్థం తీసుకుంటున్నారు. అది సరిగాదు. పిచ్చివాళ్ళు, తప్పతాగిన వాళ్ళు, పసిపిల్లలూ గూడ వస్త్రాలు లేకుండా గూడ వుండవచ్చు. కానీ వారిని "వివస్త్రులు" అని మాత్రమే అనాలి.

వేదాంతములో ఆకాశమే బ్రహ్మము యొక్క స్థూల రూపమని చెప్పబడింది. దానికంటే సూక్ష్మముగా ఉంటుంది దేశ కాల భేదాల కతీతమై సర్వత్రా, సర్వదా నిండియుండినది బ్రహ్మము. బ్రహ్మము వలె ఆకాశముగూడ సూక్ష్మము, అవికారము, సర్వగతమూ అయి దేనికీ అంటనిదై యుంటుంది. కానీ ఆకాశము ప్రళయములో నశించి మరలా సృష్ట్యారంభములో

ఏర్పడుతుంది. బ్రహ్మమలాకాదు, అది శాశ్వతము. అవినాశి. ఆకాశము జడము, బ్రహ్మము చైతన్యము. అందుకే ఆకాశము బ్రహ్మము యొక్క ఆచ్ఛాదనము లేక వస్త్రముగా చెప్పబడినది. అందుకే ద్యానములో శూన్యములో గోచరించే చిదాకాశము అనుభవమవుతుంది దాని కతీతంగా సాక్షి కేవలమైన ఎరుకగా ఆత్మ బ్రహ్మముంటుంది. కనుక బ్రహ్మానికి ఆకాశమే ఆచ్ఛాదనమని చెప్పబడుతుంది. అట్టి బ్రహ్మమే తానని ఎవడు స్థిరమైన అనుభవంతో తెల్సుకుంటాడో అతడే బ్రహ్మమయి ఉంటాడు. అతని వస్త్రము ఆకాశమే అయి ఉంటుంది. ఆ స్థితి పొందినవారికి సర్వత్రా బ్రహ్మమే అనుభవమవుతుంది. కనుక వారికి తమను అన్యులు చూస్తారని, అది ఏహ్యమని అనిపించదు. అట్టి బ్రహ్మీస్థితి సహజమయిన వారికి కృత్రిమమైన వస్త్రధారణ దుర్భరము అవుతుంది. వస్త్రము అజ్ఞానానికి చిహ్నము. అజ్ఞానంవలన తానే దేహమని, యితరులు తననుండి వేరుగా వుంటారని తలచే అజ్ఞునకు మానావమానాలు, శీతోష్ణాలుంటాయి. మనో వికారా లుంటాయి. వాటి నుండి తమను రక్షించుకోడానికి వస్త్రధారణ అవసరము అవుతుంది. దానితోబాట్లు అందమైన వస్త్రాలపట్ల భ్రాంతికూడా కలుగవచ్చు. మొత్తముమీద వస్త్రాలు అజ్ఞానానికి చిహ్నము. కానీ భగవంతుడు మానవాకృతిలో అవతరించినప్పుడు భక్తుల పైన వాత్సల్యంతో వారికర్థమయ్యే స్థాయిలో వారితో వ్యవహరించడానికి అజ్ఞానమనే వస్త్రాన్ని, దాని ప్రతిరూపమైన నశ్వరమైన దేహాన్ని ధరిస్తాడు. కానీ ఆంతర్యంలో సర్వగతమైన బ్రహ్మమే అయి వుంటాడు. అంటే దిగంబరుడై యుంటాడు! అందుకే శ్రీ పాదవల్లభులు, శ్రీ సాయిబాబాకూడ దిగంబరులే. మహనీయులలో కూడ ఎవరు సామాన్య మానవులతో కలిసి జీవించి, వారిని సన్మార్గానికి ఆకర్షించడానికి దేహం ధరిస్తారో వారు గూడ స్వతహాగా దిగంబరులైనప్పటికీ వస్త్రాలు ధరిస్తారు. అంతేగాక ఆకాశమువలె బ్రహ్మము గూడ సర్వగతమన్నాము. అవి రెండూ ఎల్లప్పుడూ మనము ఎక్కడ గుర్తిస్తే అక్కడే వున్నాయి. సర్వగతులైన శ్రీపాదవల్లభులు, శ్రీసాయి గూడ మనమెప్పుడు ఎక్కడ స్మరిస్తే - అంటే

మిగతా 29వ పేజీలో

(మే 2009 సాయిబాబా మాసపత్రిక నుండి)

దివ్యజనని ఉగాది సందేశము

పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ

శ్రీ సాయి మాస్టర్!

క్రొత్త సంవత్సరం వచ్చింది. పాత సంవత్సరానికి వీడ్కోలు చెబుతూ, క్రొత్త సంవత్సరాన్ని శుభాలను ప్రసాదించవలసిందిగా కోరుకుంటూ, ఆశిస్తూ, ఆహ్వానిస్తూ వేడుకలు జరుపుకుంటున్నాము.

నిజానికి సృష్టిలో ప్రతిదీ పాతది పోయి, కొత్తది రావడం జరుగుతూ వుంటుంది. అది గడిచిపోవడం కావచ్చు, నశించిపోవడం కావచ్చు. ఒక క్షణం పోయి మరొక క్షణం వస్తూ వుంటుంది. ఇలాగే క్షణాలు, గంటలు, రోజులు, సంవత్సరాలు, యుగాలు, మహాయుగాలు, కల్పాలు – గడిచిపోతూ వుంటాయి. విశ్వంలోని అనంతమైన గ్రహగోళాలు అన్నీ ఉద్భవించి అంతరిస్తూ వుంటాయి. అన్నీ మళ్ళీ మళ్ళీ వస్తూ వుంటాయి. కానీ వచ్చినవే మళ్ళీ రావడం జరుగదు. ఉదాహరణకు అలాంటి క్షణాలే మళ్ళీ రావచ్చు, కానీ అదే క్షణం మళ్ళీ రావడం జరుగదు.

అలాగే మన శరీరంలో నిరంతరం పాత కణాలు నశించిపోతూ, కొత్తవి ఉద్భవిస్తూ వుంటాయి. మనలోని ఆలోచనలు అనుక్షణం వస్తూ పోతూ ఉంటాయి. ఒకే రకమైన ఆలోచనలు మళ్ళీ మళ్ళీ రావచ్చుగాక, కానీ అవి అంతకు ముందటివి ఎలా అవుతాయి?

అదే విధంగా ప్రపంచంలో కోటానుకోట్ల జీవరాశులు పుడుతూ, మరణిస్తూ వుంటాయి. జీవించినపుడు వాటికి సంభవించే కష్టసుఖాలను అనుభవిస్తూ వుంటాయి. వాటికి వున్న పరిమితమైన శక్తి మేరకు కష్టాలను తప్పించుకోడానికి ప్రయత్నిస్తూ వుంటాయి. మానవుడు కూడా అలాగే అనుభవిస్తూ వున్నప్పటికీ అతని మనస్సుకు ఆలోచించగల శక్తి వున్నది గనుక సుఖాలను యింకా కావాలనుకోవడము, కష్టాలను తొలగించుకోవడానికి ప్రయత్నించడము చేస్తూ వుంటాడు. ఉదాహరణకు ఎండ, వాన వస్తే కదిలే ప్రాణులు వాటినుండి తప్పించుకోవడానికి ప్రయత్నిస్తాయి. కానీ గొడుగులాంటివి తయారు చేసుకోలేవు. అలా మానవుడు తన సంకల్పంతో పరిస్థితులను మార్చుకోవడానికి ప్రయత్నిస్తాడు. అందుకని తాను చేసిన పనులకు ఫలితాలను అనుభవిస్తాడు. ఈ ప్రయత్నం రెండు రకాలు. ఒకటి – తనతోపాటు అందరూ సుఖపడాలనుకుని అందరి శ్రేయస్సుకోసం ప్రయత్నించడము. రెండు – తనవరకూ మాత్రమే సుఖపడాలని ప్రయత్నించడము. ఈ రెండవ రకం ప్రయత్నం వల్ల స్వార్థం

పెరిగి ఇతరులకు కష్టనష్టాలు వచ్చే అవకాశం వుంది. కనుక దుష్కర్మఫలం చుట్టుకుని మళ్ళీ కష్టాలను అనుభవించవలసి వస్తుంది. దీనికి అంతెక్కడ?

కోటానుకోట్ల జీవరాశులలో ఎవరికీ లేని ఈ సుఖలాలస, దాని వలన కలిగే అశాంతి మనిషికి మాత్రమే ఎందుకు కలుగుతున్నాయి? లౌకికమైన, మానసికమైన సమస్యలు కొంతమందికి కారణమైతే, అన్నీ బాగా వున్నప్పటికీ, అంటే ఏవిధమైన లోటూ లేనప్పటికీ కొంతమందికి ఏదో తెలియని వెలితి, దానివలన అశాంతి కలుగుతున్నాయి. దీనికి గల కారణం ఎప్పటికీ వుండే సుఖము, ఆనందమూ తనకు కావాలని, దానిని పొందాలనే ఆరాటమేనని పూజ్యశ్రీ మాస్టరుగారు చెప్పారు. 'ఒకదాని వెంట మరొకటిగా వచ్చి పడుతున్న ఈ దుఃఖాలను నివారించడమెలా?' అన్నది ప్రతివారి ముందున్న అతి క్లిష్టమైన ప్రశ్న. అయితే యిటువంటి ప్రశ్న తమకు వచ్చిన కొందరు దానిని గూర్చి తీవ్రంగా ఆలోచించి పరిష్కారం చక్కగా చెప్పారు. ఈ అశాంతి, బాహ్యమైన వాటివల్ల సుఖం వస్తుందనే భ్రాంతితో, అందుకోసం చేసే ప్రయత్నంతో వచ్చేదేనని తేల్చి చెప్పారు. అయితే దీనిని అధిగమించడమెలా? మనం ఏం కోరుకోవాలి? ఏం చేయాలి? – దీనికి గూడా వారే పరిష్కార మార్గం చూపారు. పూజ్యశ్రీ మాస్టరుగారికి వచ్చిన ప్రశ్న కూడా అదే. వారి తల్లిగారు, అన్నగారి అబ్బాయి – మరణించినప్పుడు ఆ దుఃఖాన్ని పోగొట్టుకోవడం కోసం ఆయన పడిన తపన, దానికి పరిష్కారం కోసం ఆయన చేసిన అన్వేషణ – ఇవే మాస్టరుగారిని ఆ దుఃఖం నుండి శాశ్వత ఆనందస్థాయికి చేర్చాయి. అప్పటినుండి ఆయన సచ్చిదానంద పరమానంద స్వరూపులైనారు. ఎటువంటి లౌకిక పరిస్థితులకూ చలించలేదు. సుఖాలకు పొంగలేదు, దుఃఖాలకు కృంగలేదు. ఈ సృష్టిలోని అన్నింటివలెనే అంటే సూర్యచంద్ర గ్రహగోళాలు వలెనే, సకల జీవరాశి (ఒక్క మానవుడు తప్ప) వలెనే, ఆయన తన పని తాను చేసుకుపోయారు. ప్రతిదానికీ పంచభూతాలే

కారణమైనప్పటికీ ఏవి జన్మించినా, నిలచినా, నశించినా అవి చలించనట్లే పూజ్యశ్రీ మాస్టరుగారు కూడ వేటికీ ప్రతిస్పందించక తన కర్తవ్యాన్ని నిర్వర్తిస్తూ పోయారు. పరమాత్మయే తానైన ఆయనకు చేయవలసినదంటూ ఏమీ లేకపోయినప్పటికీ శ్రీకృష్ణుడు చెప్పినట్లు లోకానికి ఆదర్శప్రాయంగా ఆయన జీవించారు.

అదేవిధంగా అనేక మంది మహర్షులు, మహాత్ములు మానవుని అశాంతికి గల కారణాలను వెదికి వాటి పరిష్కారం కోసం తపస్సు చేసి అనేక మార్గాలను మనకు తెలియజేసారు. వాటిలో వేటిని సరిగ్గా ఆచరించినా శాశ్వతానందాన్ని మానవుడు పొందవచ్చు.

అయితే పూజ్యశ్రీ మాస్టరుగారు చెప్పినది ఈ కాలానికి సరిపోయిన సులభమైన మార్గం. ఆయనవేవారు: “నేనెంతో అన్వేషించి, సంవత్సరాల తరబడి ఆలోచించి తెలుసుకుని అనుభవించిన దానిని మీకు సులభంగా అందిస్తున్నాను. మీరు అంత కష్టపడాల్సిన అవసరం లేకుండా, ఎంతో తేలికగా, అట్టి ఆనందాన్ని పొందవచ్చు” అని.

ఆయనింకా యిలా చెప్పేవారు: “ఎవరికి వారు స్వధర్మాన్ని ఆచరిస్తూపోతే వారు కోరిన ఆనంద ప్రాప్తి లభిస్తుంది. ఎందుకంటే ఆ ధర్మంలోవున్న కీలకమైన, అతి ముఖ్యమైన అంశం ఏమిటంటే – ఇతరుల సంతోషం (శ్రేయస్సు) కోసం మాత్రమే కర్తవ్యం నిర్వర్తించడం. అందువలన ఆనందానికి ముఖ్యకారణమైన త్యాగం అలవడుతుంది. చివరకు అందరి ఆనందమే తన ఆనందంగా మిగులుతుంది. అలా అందరూ చేసినప్పుడు ప్రతివారూ కోరుకునే లౌకిక సుఖసౌఖ్యాలు, మానసిక శాంతి లభ్యమవుతాయి. అయితే ప్రస్తుత కాలంలో ధర్మం సరిగా చెప్పేవారూ లేరు, ఆచరించేవారూ లేరు. గ్రంథాలలో చదువుకున్న విషయాలు ప్రతివ్యక్తికీ నిత్యజీవితంలో అనుక్షణమూ వచ్చే సమస్యలకు పరిష్కార మార్గం చూపలేవు. అవి ఎవరికి వారు ఆలోచించుకుని పరిష్కరించుకోవలసిందే. అందుకని ఈ కాలానికి అట్టి ఆనందాన్ని పొందే మార్గం ఒక్కటే – అదే సద్గురువును సేవించడం. అట్టి సమర్థ సద్గురువు సాయినాథుడు. ఆయనను శరణు పొంది ఆయన లీలలను మననం చేసుకుంటూ, ఆయన సూక్తులను ఆచరణలో పెట్టుకోవడమే చేయవలసినది. ఆయన చెప్పినవన్నీ ధర్మానికి ప్రతీకలే. మన సమస్యలను ఆయనకు విన్నవించుకుంటే ప్రతి చిన్నదానికి పలుకుతున్నారు, పరిష్కారం చూపిస్తున్నారు. ఇంతకంటే మనకేం కావాలి? అయితే ఆయన యిచ్చినది పుచ్చుకుంటూ, ఆయన చెప్పినది ఆచరించకపోతే మళ్ళీ మొదటికే వస్తుంది సమస్య. ఒకదాని వెంట ఒకటి వచ్చే కోరికలకు అంతుండదు. కనుక ఆయన మన కోరికలను ఎందుకు తీరుస్తున్నారో తెలుసుకుని ఆయన చెప్పిన వాటిని ఆచరించడమే మన కర్తవ్యం. పూజ్యశ్రీ మాస్టరుగారు ఆనంద ప్రాప్తికి ఆచరించవలసిన ఎన్నో విషయాలను అరటిపండు వొలిచి నోట్లో పెట్టినట్లు బోధించారు. ఇక మనం చేయవలసినదల్లా ఒక్కటే, దానిని నమిలి మ్రింగి జీర్ణించుకోవడం. అంటే శారీరక, మానసిక బలాన్ని పొందడం. అంటే ఆయన చెప్పినవాటిని ఆచరించడం.

గడుస్తున్న ఈ అనంతమైన కాలగతిలో మన జీవిత కాలపరిమితి ఎంత? మన జన్మ ఎటువంటిది? సృష్టిలోని ప్రతిదానికి వలెనే ఈ జన్మ గడిచిపోతుంది. మళ్ళీ ఎటువంటి జన్మవస్తుందో! ఒకవేళ మళ్ళీ మానవజన్మ వచ్చినా ఈ పరిస్థితులు, ఇటువంటి సద్గురు సమాగమం మనకు లభ్యమవడం జరుగుతుందా? ఏమో! అందుకని ఈ జన్మను సద్వినియోగపరచుకోవడం ఎలా అన్నది ఆలోచించుకుంటూ బాబా చెప్పినవాటికి పూజ్యశ్రీ మాస్టరుగారు చెప్పిన విశ్లేషణను అర్థం చేసుకుంటూ, ఆచరించడానికి ప్రయత్నిస్తామని, ఈ సంవత్సరమైనా మనం కోరుకునే ఆనంద ప్రాప్తికి ప్రయత్నం చేస్తామని ఆశిస్తూ, అట్టి వివేకవంతమైన బుద్ధిని ప్రసాదించమని పూజ్యశ్రీ మాస్టరుగారిని ప్రార్థిస్తున్నాను. •



(గత సంచిక తరువాయి)

సిద్ధయ్య

శ్రీమతి శ్రీదేవి

ముస్లిం పెద్దలంతా ముడుమాల నుండి బయలుదేరి కందిమల్లయపల్లె లోని శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆశ్రమం చేరుకున్నారు. అక్కడ సిద్ధయ్యతో వారిలా సంభాషించారు.

ముస్లిం పెద్దలు : ఏమి సిద్ధయ్యా! నువ్వొక ముసల్మానువు ఇలా హిందూగురువును ఆశ్చయించవచ్చునా?

సిద్ధయ్య : ఈ మత భేదాలన్నీ మన మనసులలోనే తప్ప వాస్తవంగా లేనేలేవు. అయినా అన్ని మతాల సారాంశం మానవుడు భగవంతుని తెలుసుకోవాలన్నదే కదా!

ముస్లిం : అన్ని మతాల సారం ఒకటే అయినపుడు యిక మతం మారవలసిన అవసరమేముంది?

సిద్ధయ్య : మానవ జీవిత లక్ష్యాన్ని మతాలన్నీ ఒకే రకంగా నిర్దేశిస్తుండగా ఏ మతమైనా ముక్తి సాధనకు అడ్డురావటం అనేది వుండదు. సాధకుడు ఎవరినైతే ఆశ్రయించాడో ఆ సద్గురువు అతని సంస్కారానికి తగిన విధంగా ఆత్మబోధ గావించి ముక్తిమార్గం వైపు నడిపిస్తారు.

ముస్లిం : ఇస్లాం చెప్పినదే నీకు, మనందరికీ తగిన విధానం లేకుంటే అల్లా నిన్ను ముసల్మానుగానే ఎందుకు పుట్టిస్తాడు?

సిద్ధయ్య : ముసల్మానులు, హిందువులు, క్రైస్తవులు అందరూ ఒక భగవంతుని బిడ్డలే. వివిధ మతాలలోని వారుగా అనిపిస్తున్న సద్గురువులంతా ఒకే భగవంతుని స్వరూపాలే. ఈ సత్యాన్ని గుర్తించని వారు కులాలు, మతాలు అనే సంకుచిత భావాలలో కొట్టుమిట్టాడుతుంటారు. నా గురుదేవులు శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి ఏ కులము, మతము వారు అన్నది నాకు ముఖ్యం కాదు. సకల మతాలు వారిలోనే వున్నాయి. సకల సృష్టికర్త వారే. నా మనస్సు వారి పాదాలకు అంకితమై పోయింది. వారు లేక నేను జీవించలేను. వారిని విడచి రాలేను. ఎందుకంటే నా సర్వసం వారే కనుక! అని అంటుంటే సిద్ధయ్య కన్నులు అశ్రుపూరితాలైనాయి.

సిద్ధయ్య ఆంతర్యం తెలుసుకున్న ముస్లిం పెద్దలు. లోగడ అనుకున్న ప్రకారం సిద్ధయ్య గురించి కడప నవాబుకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై సంజాయిషి యిచ్చుకొనవలసిందిగా కడప నవాబు వద్దనుండి శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామివారికి సమన్లు అందాయి. స్వామివారి తరఫున సిద్ధయ్య నవాబు ఎదుట హాజరైనాడు. నవాబు ఎదురుగా నిలుచున్న సిద్ధయ్యను నవాబుకు సలాం చేయవలసిందిగా ఆజ్ఞాపించారు ముస్లిం మతపెద్దలు. తాను తన గురుదేవులకు మాత్రమే నమస్కరిస్తాననీ, తన నమస్కారాన్ని అందుకునే శక్తి శ్రీ స్వామివారికి తప్ప మరెవరికీ లేదని చెప్పిన సిద్ధయ్యపై నవాబు కోపిస్తాడు. తన మాటను నిరూపించదలచిన సిద్ధయ్య ఒక పెద్ద బండరాతిని తెప్పించి దానికి నమస్కరించగా ఆ బండరాయి వెంటనే బ్రద్దలై రెండు ముక్కలుగా విడిపోతుంది. ఆ దృశ్యాన్ని చూచిన నవాబు నిర్ఘాంతపోతాడు.

శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామిని మహిమాన్వితుడుగా గుర్తించిన నవాబు ఆయనను తన రాజ్యానికి విచ్చేయవలసిందిగా సగౌరవంగా ఆహ్వానిస్తాడు. ఆ నవాబు ఆహ్వానాన్ని మన్నించి శ్రీ స్వామి కడప పట్టణానికి వస్తారు.

స్వామి వారిని పరీక్షించదలచిన నవాబు స్వామితో నూనె లేకుండా దీపాలను వెలిగించమంటాడు. తన కమండలంలోని నీటితో దీపాలను వెలిగిస్తారు స్వామి. నవాబు స్వామివారిని సత్కరిస్తూ విందు భోజనంలో మాంసపు ఫలహారాలను వడ్డిస్తాడు. స్వామి సంకల్పంతో అవన్నీ తీయని ఫలములుగా మారిపోతాయి. స్వామికి పాదాక్రాంతుడైన నవాబుకు, అచటి ప్రజలకు వారి అభ్యర్థనతో కాలజ్ఞానాన్ని విన్పించి, ధర్మబోధ చేస్తారు శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి.

కాలక్రమేణా స్వామివారి లీలలు దశదిశలా వ్యాపించటంతో సకలజనులు శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వారిని తమ తమ గ్రామాలకు ఆహ్వానించ సాగారు. స్వామివారు బోధించే ధర్మ ప్రవచనాలు, కాలజ్ఞాన బోధలు ప్రజలను భక్తిమార్గం వైపు ఆకర్షించసాగాయి.

ఒకసారి నంద్యాల నవాబు శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వారిని తమ రాజ్యంలోని ప్రజలకు ధర్మబోధ గావించవలసిందిగా నంద్యాల పట్టణానికి ఆహ్వానిస్తాడు. శిష్యగణంతో స్వామి నంద్యాలకు వెళ్తారు. నవాబు స్వామి మహిమను పరీక్షించదలచి తాను సమర్పించే విందు భోజనం ఆరగించమని ప్రార్థిస్తాడు. శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి అందుకు అంగీకరిస్తారు. అసంఖ్యాక ప్రజల సమక్షంలో నవాబు ఎత్తైన అన్నపురాశిని పోయించి, స్వామితో ఆ అన్నమంతా ఒక్క మెతుకు కూడా మిగల్చక ఆరగించమని ప్రార్థిస్తాడు. ఆ కార్యాన్ని తన శిష్యుడైన సిద్ధయ్య చేయగలడని చెప్పగా, సిద్ధయ్య స్వామి వారి అనుగ్రహంతో అతి కొద్ది సమయంలోనే ఆ అన్నపురాశినంతా ఆరగిస్తాడు. ఆ దృశ్యం చూసిన నవాబు, ప్రజలు దిగ్భ్రాంతులైనారు. అందరూ ఆయనకు పాదాక్రాంతులైనారు, ఆ పట్టణంలో శ్రీవీరబ్రహ్మేంద్ర స్వామి కాలజ్ఞానాన్ని వినిపిస్తూ గ్రామ గ్రామాన ధర్మ ప్రబోధం గావిస్తూ ముందుకు సాగుతారు.

కలికాల ప్రభావం వలన మనుష్యుల మనసులలో, ప్రవర్తనలో, జీవిత విధానాలలో ఎటువంటి మార్పులు వస్తాయో తెలియజెప్పేదే కాలజ్ఞానం. ధర్మము, దైవభక్తి నశించి మానవ సంబంధాలు అస్తవ్యస్తమై, ప్రకృతి సమతౌల్యత దెబ్బతిని, భూమండలం అనేక వైపరీత్యాలకు లోను అవుతుందనీ, మానవులు ఎన్నో బాధలకు గురి అవుతారని హెచ్చరిస్తూ, అటువంటి పరిస్థితులలో మానవులు అప్రమత్తులై జీవించాలని బోధిస్తూ, ధర్మం వైపు నడిచేలా మార్గనిర్దేశం – చేసేదే కాలజ్ఞానం

శ్రీ స్వామివారు సిద్ధయ్యకు ఎన్నో సాధనా విధానాలను బోధించి ఆధ్యాత్మిక మార్గంలో ముందుకు నడిపించారు. శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వారికి అసంఖ్యాక శిష్యగణం వున్నారు. వారందరిలో అగ్రగణ్యుడుగా సిద్ధయ్య ఖ్యాతి గాంచాడు. అతని పురోగతిని, పేరు ప్రతిష్టలను ఓర్వలేని వారెందరో అతనిని ఎన్నో బాధలకు గురిచేసినా, వాటన్నింటినీ ఎదుర్కొని సిద్ధయ్య నిజమైన గురుభక్తునిగా గుర్తింప బడ్డాడు. సిద్ధయ్య ముసల్మాను మతానికి చెందిన దూదేకుల కులానికి చెందినవాడు. హైందవ గురువును ఆశ్రయించటంతో అతడు యిరు మతాల వారి నుండి ఎన్నోరకాల విమర్శలను, ఒత్తిళ్ళను, అవమానాలను ఎదుర్కొనవలసి వచ్చింది. కాలాంతరంలో అతడు కుల మత భేదాలను, వైషమ్యాలను, సామాజిక వైషములను అసమానతలను నిరసిస్తూ తద్వారా సర్వజన సౌభ్రాతృత్వాన్ని బోధించాడు.

సిద్ధయ్య బోధించిన తత్వాలు ప్రజలలో బహుళ ప్రచారంలో వున్నాయి. కుల మతాలను నిరసిస్తూ అతను పాడిన గేయ రూపంలోని ఒక తత్వం యిలా వుంది...

ఏ కులమని నను వివరం బడిగిన
ఏమని చెప్పుదు లోకులకు
లోకులకు పలుగాకులకు
దుష్టులకు దుర్మార్గులకు
॥ ఏ కులమని॥

ఇంటి లోపల యిల్లు కట్టుకుని
మంట లోపల రాటం బెట్టుక
కంటి లోపల కదురు పెట్టుకుని
ముక్కులోపల ఏకు పెట్టుకుని
॥ ఏ కులమని॥

చేతిలో బాక చేతికి తీసుక
నారాయణ అను నరము తీసుకుని

అష్టాక్షరి యను పంచ తీసుకుని
తకథిను తకథిమ గుబదెబ గుబ దెబ
ఏకిన కులమే మాకులము
॥ ఏ కులమని॥

ముట్టున పుట్టింది కులము
ముట్టంచున పెరిగింది కులము
ఏకిన ఏకులు పీకిన పిందెలు
లోకమంత నొక పాపము జేసుక
ఏకిన కులమే నా కులము
॥ ఏ కులమని॥

ఈ విధంగా తన తత్త్వాల ద్వారా కుల మత విభేద నిర్మూలనకు, సిద్ధయ్య కృషి చేశాడు.

మహాత్ములు మానవాళి శ్రేయస్సుకై ఒక నిర్దుష్టమైన ప్రణాళికతో అవతరించి, ప్రజలకు ధర్మాన్ని బోధించి తాము తలపెట్టిన కార్యం ముగిసిన వెంటనే అవతారం చాలిస్తారు. శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి తమ అవతారం చాలించే సమయం ఆసన్నమవటంతో అందుకు తగిన సన్నాహాలు చేయనారంభిస్తారు. అందుకు ఆయన తన నలుగురు కుమారులను పిలచి, తాను వైశాఖ శుద్ధ పంచమినాడు జీవసమాధినొంద బోతున్నామనీ, అందుకు తగిన ఏర్పాట్లను చేయవలసిందిగా ఆదేశిస్తారు. కుమార్తె వీర నారాయణమ్మను ఆశీర్వదించి, ఆమె కుమారుడినే తన పీఠానికి వారసునిగా ప్రకటించవలసిందిగా భార్య గోవిందమ్మను ఆదేశిస్తారు.

స్వామివారు జీవసమాధి చెందుతున్నారన్న విషయం విని బాధ పడుతున్న గోవిందమ్మను ఓదార్చి, తాను నిత్యసత్యుడనని తనకు మరణం లేదనీ, కనుక తన సమాధి అనంతరం సుమంగళీ చిహ్నాలైన మాంగల్యం మొదలైన చిహ్నాలను ఆమె తొలగించుకొననవసరం లేదని ఆదేశిస్తారు స్వామి.

సిద్ధయ్యకు శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామితో గల అనుబంధం మాటలలో చెప్పవీలుకానిది. స్వామివారి వియోగాన్ని అతడు. ఎలా భరించగలడు? అందుకేనేమో స్వామి అతనికి తన జీవసమాధి గురించి ముందుగా ఏమాత్రం తెలియనీయకపోయి వుండవచ్చు. ఆ బాధాకరమైన ఘట్టాన్ని చూచి భరించలేడన్న ఉద్దేశంతోనేమో స్వామి వారు అతనిని పిలచి, ఎక్కడైతే తాను కాలజ్ఞానరచన చేశారో, ఆ బనగానపల్లె పట్టణానికి వెళ్ళి పూజ నిమిత్తం దేవదారు పుష్పాలను సేకరించి తీసుకొని రావలసినదిగా ఆదేశిస్తారు. మరుసటి రోజు సూర్యోదయం తర్వాత తొమ్మిది ఘడియల లోపు పువ్వులను అందజేయాలని చెపుతారు స్వామి.

నిర్ణీత సమయం వైశాఖ శుద్ధ పంచమి నాడు శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి జీవసమాధిలో ప్రవేశించటానికి సకల ఏర్పాట్లు గావించబడ్డాయి. స్వామివారు ప్రజలందరికీ తమ అంతిమ సందేశం వినిపించి, సమాధి లోనికి ప్రవేశించటానికి సంసిద్ధులౌతారు. అచటి ప్రజల దుఃఖం వర్ణనాతీతం. తమ కోసం అవతరించి, ధర్మబోధలతో, కాలజ్ఞాన బోధలతో తమను మోక్షమార్గాన నడిపించిన ఆ నడిచే దైవం కనుమరుగైపోతున్న ఆ తరుణం భక్తుల హృదయాలను కలచివేస్తుండగా, విధిలేని పరిస్థితులలో అశ్రుధారలతో ప్రజలంతా శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామివారికి అంతిమ వీడ్కోలు పలుకుతుండగా స్వామి సమాధిలో ప్రవేశిస్తారు.

మహోన్నతమైన దైవశక్తియే శ్రీ వీర బ్రహ్మేంద్రస్వామిగా అవతరించగా, ఆ పాంచభౌతిక దేహాన్ని సజీవంగా నిక్షిప్తం చేసుకున్న ఆ జీవసమాధిని ఆ సమయంలో జనులంతా బరువెక్కిన గుండెలతో, ఒక వంక కన్నీటిధారలతో అభిషేకిస్తూ, మరొకవంక అసంఖ్యాక పుష్పరాశులతో, టెంకాయ, ఫల నివేదనలతో, ధూప దీపాదులొసగి పూజించి, కర్పూర హారతు లర్పించి సేవించుకొన్నారు.

కందిమల్లయపల్లె పుణ్యభూమిలో సశరీరులై సజీవంగా సమాధిస్థులై నిలచి, నాటికీ, నేటికి పిలచిన పలుకుతూ కొలిచిన వారి కొంగు బంగారమై భక్తులను పాలిస్తున్న కరుణామయుడు శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి.

ఒకవైపు సిద్ధయ్య కందిమల్లయపల్లెనుండి కాలి నడకన బయలు దేరుతాడు. అక్కడి నుండి బనగానపల్లె 120 మైళ్ళ దూరంలో వుంది. స్వామిని తలచుకొని వారి మహిమతో బనగానపల్లెలోని పువ్వులను సేకరించి తిరిగి వస్తుండగా అతనికి స్వామివారు జీవసమాధి చెందారన్న వార్త తెలుస్తుంది. పట్టరాని దుఃఖంతో పరుగుపరుగున కందిమల్లయపల్లె చేరి స్వామి సమాధి వద్ద విలపించి విలపించి చివరకు ఆ దుఃఖభారాన్ని తట్టుకొనలేక

ప్రాణత్యాగానికి సిద్ధమౌతాడు. తన ప్రియశిష్యుని ఆవేదన స్వామికి తెలియకుండా వుంటుందా? సమాధిపై ఆశీనులై సిద్ధయ్యకు దర్శనమిచ్చారు శ్రీ వీర బ్రహ్మేంద్రస్వామి.

సామి దర్శనంతో పులకించిపోయాడు సిద్ధయ్య. తమ పాదాలపైబడి దుఃఖిస్తూ తమను విడచి ఎందుకు వెళ్ళారనీ, తనకింక దిక్కెవరని ప్రశ్నిస్తున్న సిద్ధయ్యతో తానెక్కడికీ వెళ్ళలేదని, నిత్యసత్యుడనై సమాధి నుండి కూడా భక్తులను అనుగ్రహిస్తుంటానని సిద్ధయ్యను ఓదార్చి దీవిస్తారు స్వామి. రాజయోగమార్గసాధనలో ముక్తిని సాధించమనీ, భవిష్యత్తులో బ్రహ్మ మార్గ ప్రచారం చేస్తూ సద్గురుడవై ప్రజలను మోక్షమార్గాన నడిపించ గలవని ఆశీర్వదించి, తమ గుర్తుగా పూజించుకొమ్మని చెపుతూ, తను పాదుకలు, యోగదండము, శిఖాముద్రిక, బెత్తము, జపమాల ప్రసాదిస్తారు. గృహస్థాశ్రమం స్వీకరించి ఉత్తమ గృహస్థుగా జీవించమని సిద్ధయ్యను ఆదేశిస్తారు శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి.

తాను లేకుండా, తన కేమాత్రం తెలియనీయకుండా జీవసమాధి చెందిన తన గురుదేవుల వియోగంతో ఆత్మాహుతికి పాల్పడ్డ సిద్ధయ్య స్వామి దర్శనంతో సంతసించి, స్వామి వారి ఓదార్పుతో, ఆశీస్సులతో వియోగ బాధను మరచిపోతాడు. ఆయన ప్రసాదించిన అత్యంత మహిమాన్వితములయిన ఆ పవిత్ర వస్తువులను భక్తితో స్వీకరిస్తాడు. గురుపత్ని గోవిందమ్మ వద్ద సెలవు గైకొని కందిమల్లయపల్లెను వీడి, తన స్వగ్రామమైన ముడుమాలకు తన తల్లిదండ్రుల వద్దకు చేరుకుంటాడు. గురుదేవుల ఆజ్ఞపై గృహస్థాశ్రమం స్వీకరించి ధర్మబద్ధమైన గృహస్థ జీవితం గడుపుతాడు. రాజయోగావలంబియై సాధన కొనసాగిస్తూ, బ్రహ్మ మత ప్రచారం గావిస్తూ, సద్గురువై అసంఖ్యాక ప్రజలను ఆధ్యాత్మిక మార్గంలో నడిపించాడు సిద్ధయ్య.

సిద్ధయ్య మహిమలు అసంఖ్యాకం. తన తపోబలంతో భక్తులను కాపాడిన సందర్భాలు ఎన్నో! ఒకసారి పాముకాటుతో చనిపోయిన కుమారుని తెచ్చి సిద్ధయ్య పాదాలపై పడవేసి ఎలాగైనా వానిని బ్రతికించమంటూ వేడుకుంటుంది. ఒక తల్లి. సిద్ధయ్య తన మహిమతో అతనిని బ్రతికిస్తాడు.

ఒక సందర్భంలో సిద్ధయ్య 'భగవంతుడు లేడు' అంటూ వితండవాదం చేస్తున్న నాస్తికులతో చర్చలు జరుపుతుంటాడు. ఉన్నట్లుండి, దక్షిణ దిక్కుకు తిరిగి కఠిన స్వరంతో "ఆగు! వెళ్ళు, యిక్కడ నుండి!" అని గట్టిగా కేకలు వేస్తాడు. అలా ఎందుకు అరిచారని అడిగిన వారితో "దక్షిణ దిక్కున వుండే యలమవారి కొండలపై గడ్డిమేస్తూవున్న చూడి ఆవును ఒక క్రూరమైన పులి చంపబోతుంటే ఆ పులిని తరిమి వేశాను" అన్నాడు సిద్ధయ్య.

ఇంతలో ఒక ఆవులకాపరి తన ఆవుతో సహా పరుగుపరుగున సిద్ధయ్య వద్దకు వచ్చాడు. తన ఆవు మెడపై పులిపంజా గుర్తులు, రక్తసిక్తమై వున్న గాయాలు చూపిస్తూ, "పులి ఆవును చంపబోతున్న సమయంలో సిద్ధయ్య అక్కడ ప్రత్యక్షమై పులిని వెళ్ళగొట్టి ఆవును కాపాడారు" అని అక్కడి వారితో చెప్పి సిద్ధయ్యకు నమస్కరించాడు.

ఈ విధంగా ప్రజలకు ఐహిక, ఆధ్యాత్మిక శ్రేయస్సు చేకూరుస్తూ వారి హృదయాలలో దైవంగా కొలువైనిలచిన సిద్ధయ్య తన 71వ సంవత్సరంలో

శివైక్యం చెందారు. 1665వ సం॥లో జన్మించిన సిద్ధయ్య 1736వ సం॥లో ముడుమాల గ్రామంలోనే జీవసమాధి చెందారు.

'సిద్ధయ్యసాటిలేని గురుభక్తుడు' అని చెప్పవచ్చు. తన తనువును, మనసును, తన జీవితాన్ని తన గురువైన శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామికి అర్పించి, త్రికరణ శుద్ధిగా ఆయనను సేవించి, తరించి, 'సిద్ధయ్యవంటి శిష్యుడు లేడు' అని కొనియాడబడిన సిద్ధయ్య ధన్యజీవి.

'గురువు లేక విద్య గురుతుగా దొరకదు' అన్న వేమన సూక్తి ప్రకారం మోక్షమే జీవిత లక్ష్యంగా ఎంచుకున్న సాధకులకు సద్గురువును ఆశ్రయించి, ఆయన మార్గదర్శకత్వంలో సాధన కొనసాగించటం అనివార్యం. తన గురువైన శ్రీవీరబ్రహ్మేంద్రస్వామిని మ నో వా కా ్ య ా ల తో సేవించి, తరించిన సిద్ధయ్య మోక్షగాములందరికి ఆదర్శపురుషుడు అనటంలో ఏమాత్రం సందేహం లేదు.

సమాప్తం

మాతృదేవి మహాసమాధి

శ్రీమతి T.పద్మావతి

2021 సంవత్సరం, వైశాఖమాస కృష్ణ పక్ష దశమి, గురువారం రోజున అందరూ 'అమ్మగారు' అని భక్తిప్రపత్తులతో కొలుచుకునే, పిలుచుకునే పూజ్యశ్రీ అలివేలుమంగమ్మ తల్లి తమ జగన్నాటకాన్ని లీలా వినోదంగా ముగించి విశ్వవ్యాపకత్వం చెందారు.

ఆంగ్ల తేదీ ప్రకారం, 2021 జూన్ 3వ తేదీ గురువారం మధ్యాహ్నం గం.1-12ని॥లకు పూజ్యశ్రీ అమ్మగారు సమాధి చెందిన వార్త దావానలంలాగ అన్ని చోట్లకీ వ్యాపించింది. ఈ హఠాత్పరిణామానికి దిగ్భ్రాంతులైన భక్తకోటి శోకసముద్రంలో మునిగి పోయింది. ఏది ఏమైనా, వారి అవతారకార్యంతో 'ఇది' నిర్ణయింపబడినది. కనుక, దానికి తల ఒగ్గక తప్పలేదు. తక్షణమే శ్రీ ద్వారక బాబుగారు తరవాత జరగవలసిన విధి విధానాలను అమలుపరచడంలో త్వరిత గతిన నిర్ణయాలను తీసుకుంటూ, జూన్ 3వ తేదీ రాత్రి పూజ్యశ్రీ అమ్మగారితో సహా, గురుకుటుంబం కొంత మంది గురుంధువులు కలిసి నాగోలు నించి బయలుదేరి, నాల్గవతేదీ తెల్లవారుతూనే ఒంగోలులోని పూజ్యశ్రీ మాస్టరు గారి నివాసానికి చేరుకున్నారు.

ఆ సమయంలో కరోనా ప్రభావం ఎక్కువగానే ఉండటంతో, అందరి క్షేమం దృష్ట్యా శ్రీ ద్వారక బాబుగారు, ఎక్కడి వారక్కడే ఉండి పోవలసినదని, జరగబోయే కార్యక్రమం అంతా ప్రత్యక్షప్రసారం చేయబడుతుందని ప్రకటన చేసారు. కానీ, ఒంగోలు, ఆ పరిసర పట్టణాల నించి కొంతమంది పూజ్యశ్రీ అమ్మగారిని, చివరిసారి చూడటం కోసం తరలి వచ్చారు. చాలామంది శ్రీ బాబుగారి మాటకు కట్టుబడి వుండిపోయారు.

మధ్యాహ్నం పూజ్యశ్రీ అమ్మగారికి మంగళ స్నానం చేయించి, నూతన వస్త్రాలతో అలంకరించి, పూజ్యశ్రీ బాబా, మాస్టరు గార్ల సూచనల మేరకు, ఒంగోలుకు 25 కిలోమీటర్ల దూరంలో వున్న 'గుమ్మళంపాడు' అనే గ్రామానికి సమీపంలో వున్న ఖాళీ ప్రదేశానికి తీసుకువెళ్ళారు.

చుట్టుపక్కలంతా చిన్న చిన్న పల్లెటూర్లు వున్నా--. ఆ ప్రదేశానికి రెండు కిలోమీటర్ల దూరంతో అటుగాని, ఇటుగాని ఏ ఊర్లు లేవు. చుట్టూ చెట్టుచేమలలో వున్న పూర్తి ఏకాంత ప్రదేశం!

కానీ అక్కడికి చేరేసరికి, ఎన్నో కార్లు, ఇతర వాహనాలు బారులుతీరి వున్నాయి. అంటే ఏదో చిన్నపాటి సమాచారాన్ని అందుకుని అక్కడికి అంతమంది చేరారు. అదే covid లేక పోయివుంటే, శ్రీ సాయిలీలామృతం సమాధి ఘట్టంలో చెప్పినట్లు, పూజ్యశ్రీ అమ్మగారి వాహనం అక్కడకి చేరేసరికి ఎంత సమయం పట్టేదో అనిపించింది.

ఆ రోజు పూజ్యశ్రీ అమ్మగారి దివ్యమంగళ రూపం పూర్ణకళలతో శోభిస్తూ, సాక్షాత్తు లక్ష్మీదేవిలా ప్రకాశించారు. జూన్ 4వ తేదీ సాయంత్రం దాదాపు 6.30 - 7.00 గంటల మధ్య పూజ్యశ్రీ అమ్మగారు బృందావన ప్రవేశం చేసారు. అదే రోజు నించి, అక్కడ గుడారాలు వేసుకుని కొద్దిమంది గురు బంధువులు నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. జూన్ 5వ తేదీ నుండి, పూజ్యశ్రీ బాబా, మాస్టరు అమ్మగార్లకు నిత్యపూజ, నివేదన, హారతులతో కైంకర్యాలు మొదలయ్యాయి. నిత్యాన్నదానం కూడా ప్రారంభించబడింది. సాక్షాత్తు అన్నపూర్ణాదేవి కొలువై వుంటే, అన్న ప్రసాదాలకి లోటేముంది మరి!!

నెమ్మది నెమ్మదిగా చుట్టుపక్కల

ఊర్ల వాళ్ళందరూ ఆ ప్రదేశంలో ఏం జరుగుతోందో చూద్దామని రాసాగారు. అలా వచ్చిన ప్రతివారు తిరిగి తిరిగి 'అమ్మ' దర్శనానికి వస్తూ, "ఈ అమ్మవారు హైదరాబాదు నించి ఇలా మా మధ్యకి రావడం, మేమందరం చేసుకున్న పుణ్యఫలం, మా అదృష్టం" అంటూ వేనోళ్ళు కొనియాడుతూ అక్కడ. జరిగే అన్ని ఉత్సవాలలోను పాల్గొంటూ మహదానందాన్ని పొందుతున్నారు. అంతటి ఆనందానికి కారణమేమంటే... అక్కడకి పూజ్యశ్రీ అమ్మగారు వచ్చిన దగ్గర నుండి వర్షాలు బాగా పడ్డాయట. తద్వారా పంటలు బాగా పండాయట. అంతేకాదు, ఎన్నో అద్భుతమైన అనుభవాలను కూడా ప్రసాదిస్తున్నారట.... "ఈ తల్లి సత్యమైన తల్లి" అంటూ ఎంతో భక్తిప్రపత్తులతో వారి ఇంటినించి ఏదో ఒక ప్రసాదం తీసుకుని పూజ్యశ్రీ అమ్మగారికి నివేదిస్తున్నారు. వారికి పండిన మొదటి పంటని అమ్మగారికి సమర్పించాకే వారి ఇంట్లో వాడుకుంటున్నారు. అక్కడికి రాగానే మనస్సు ప్రశాంతమవ్వడం కూడా అనుభవమౌతుందని చెబుతున్నారు.

ఒంగోలులోని భక్తులకు, చుట్టు పక్కల పట్నాల లోని భక్తులకు, అద్భుతమైన అవకాశం లభించింది. అందరూ ఒంగోలులో 'అయ్యవారి' దర్శనం చేసుకుని, ఇక్కడకొచ్చి 'అమ్మగారి' దర్శనం చేసుకుని వెడుతున్నారు. చుట్టుపక్కల కొంతదూరం వెడితేనే గాని ఏదీ దొరకని ఆ ప్రదేశంలో పూజ్యశ్రీ అమ్మగారికి... 3వరోజు, 7వరోజు, 13వరోజు, మాసికపూజ, మండల పూజ ఉత్సవాలన్నీ అందరి సహకారంతో, ఉత్సాహంతో ఎంతో వైభవంగా జరిగాయి. నెమ్మదిగా 'కరోనా' ప్రభావం కూడా తగ్గేనరికి, భక్తులందరూ అమ్మ సన్నిధిని ఆనందంగా దర్శిస్తున్నారు.

మాతృదేవి దివ్యసన్నిధిలో ఏర్పాట్లు కూడా శరవేగంతో జరుగుతున్నాయి.

మిగతా 24వ పేజీలో

వార్తాలాపము

(గత సంచిక తరువాయి)

శ్రీమతి అడిదం వేదవతి

శ్రీ ప్రకాశానంద స్వామివారిచే విరచితమైన వార్తాలాపమనే యీ గ్రంథము గ్రాంథికభాషలో వ్రాయబడి వుండటం వలన తమకు అర్థంగావడం లేదని చాలామంది పాఠకులు అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. అందుకని పాఠకుల అభ్యర్థన మేరకు పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి ప్రియపుత్రిక శ్రీమతి అడిదం వేదవతిగారు సరళమైన భాషలో ఈ గ్రంథాన్ని పాఠకులకు అందజేస్తున్నారు - ఎడిటర్.

తొమ్మిదవ ప్రసంగము

తరువాతి రోజున ఉదయం స్నానాదులు పూర్తిచేసుకుని నిత్యానంద స్వామివారి దగ్గర అందరూ కూర్చున్నారు.

త్ర్యంబకభాయి ఇలా ప్రశ్నించాడు "నిన్న రాత్రి మోఘాశా మోఘ కర్మాణః మొ॥న వాక్యాల ద్వారా అసుర రాక్షస ప్రకృతులను వివరించారు. ఇక దైవప్రకృతి మిగిలివున్నది. దయతో వివరించండి".

నిత్యానంద స్వామివారు శ్రీ ప్రకాశానంద స్వామివారిని వివరించమన్నారు -

స్వా॥ ప్ర॥ :- భగవద్గీతలో శ్రీకృష్ణుడు ఇలా చెప్పాడు

శ్లో॥ మహాత్మానస్తు మాం పార్థ
దైవీం ప్రకృతిమాశ్రితాః ।
భజన్త్యనన్య మనసో జ్ఞాత్వా
భూతాదిమవ్యయమ్ ॥

భావం: 'ఓ అర్జునా! దైవప్రకృతిని ఆశ్రయించి నన్ను తప్ప అన్యులను తలచని మహాత్ములు నన్ను ప్రతిప్రాణికీ కారణంగాను, నాశము లేనివానిగానూ తెలుసుకుని భజిస్తారు.

భగవద్గీత 16వ అధ్యాయంలో దైవప్రకృతికి సంబంధించిన 26 గుణాలను మూడు శ్లోకాలలో వివరించాడు.

శ్లో॥ అభయం సత్త్వసంశుద్ధిః
జ్ఞానయోగ వ్యవస్థితిః ।
దానం దమశ్చ యజ్ఞశ్చ
స్వాధ్యాయస్తప ఆర్జవమ్ ॥

భావం :- అభయము, అంతఃకరణ పరిశుద్ధంగా వుండడము (అంతఃకరణ పారిశుద్ధ్యము) జ్ఞానం పట్ల, యోగం పట్ల నిలకడగా వుండడము, దానము, దమము, యజ్ఞము, స్వాధ్యాయము, తపము, సారల్యము.

- సశేషం

మాతృదేవి స్మృతులు

శ్రీమతి కమలా రామచందర్

నాగోలు సత్సంగ సభ్యురాలు శ్రీమతి కమలారామచందర్ పూజ్యశ్రీ అమ్మగారి లీలావైభవాన్ని ఈవిధంగా తెలియచేస్తున్నారు.

మొట్టమొదట మా మరిదిగారి ద్వారా శ్రీసాయిలీలామృతం గ్రంథం మాకు చేరింది. అది పారాయణ చేసాక నాకు, మావారికి చాలా ఆనందం కలిగింది. నాకు సాయినాథుడు ముస్లిం ఫకీరు అనే భావన ఉండేది. మా ఇంట్లో హిందూ సాంప్రదాయం బాగా పాటించేవాళ్ళము. మావారికి మాత్రం బాబా అంటే నమ్మకం ఉండేది. కానీ మొట్టమొదటిసారి మేమిద్దరం పూజ్యశ్రీ మాస్టరుగారు రాసిన గ్రంథం చదివిన తరువాత ఇంత అద్భుతంగా రచించిన వారికి ఉత్తరం రాయవలసినదే అనిపించి పూజ్యశ్రీ మాస్టరుగారికి మా ఆనందాన్ని వ్యక్తం చేస్తూ ఉత్తరం రాసాను. వారు సమాధానం రాశారు. అప్పటినించి ఉత్తరప్రత్యుత్తరాలు జరుగుతుండేవి.

మావారికి ఆఫీసు పనిమీద మద్రాస్(చెన్నై) వెళ్ళవలసి వచ్చింది. ఆయన వెడుతూ "పూజ్యశ్రీ మాస్టరుగారిని దర్శించుకుని వద్దాము. నువ్వూ వస్తావా?" అని అడిగారు. అప్పటికి విద్యానగర్ బాబా గుడికి మేము కూడా చందాలు వసూలు చేసివున్నాము. అవి పూజ్యశ్రీ మాస్టరుగారికి స్వయంగా అందజేసినట్టు ఉంటుందని నేనూ బయలుదేరాను.

1978వ సంవత్సరం హోలీ పండుగరోజు, ఆ పుణ్యదంపతుల దర్శనం మాకు కలిగింది. ఆ దంపతులు ఎంతో ప్రీతితో పలకరించారు. పూజ్యశ్రీ అమ్మగారు "మీరేనా ఉత్తరాలు రాస్తారు?" అని అడిగారు. చిన్నారి వేదమ్మకి పూజ్యశ్రీ మాస్టరుగారు నన్ను 'అత్త' అని పరిచయం చేసారు. మొదటి పరిచయంలోనే మాతో అంతటి అనుబంధాన్ని కలుపుకున్న ఆ గురుదంపతుల ప్రేమకు ఆనందంతో హృదయం నిండిపోయింది. నేను పూజ్యశ్రీ అమ్మగారికి వంటలో సహాయం చేయడానికి వెడితే, "మీరు ఏ పనీ చెయ్యొద్దు, పూజ్యశ్రీ మాస్టరుగారి దగ్గర కూర్చోండి" అని మొత్తం వంటంతా అమ్మగారే చేశారు. హోలీ పండుగ పూట, పూజ్యశ్రీ అలివేలుమంగమ్మ తల్లి దివ్యహస్తాలతో వండిన మధురాతి మధురమైన ఆ ప్రసాదం మాకు లభించటం ఎన్ని జన్మల సుకృతమో!!

కాలగమనంలో అనేక సంఘటనలు చోటుచేసుకున్నాయి. తీరని లోటును కలిగించే సంఘటన పూజ్యశ్రీ మాస్టరుగారి సమాధి. వ్యధాభరిత హృదయంతో వున్న నాకు ఒక స్వప్నం వచ్చింది. అది ఒక భూగృహం. అందులో పూజ్యశ్రీ మాస్టరుగారు డెస్క్ ముందు కూర్చుని ఏదో రాసుకుంటున్నారు. కళ్ళజోడు పెట్టుకుని వున్నారు. నేను లోపలకి వెళ్లి, పూజ్యశ్రీ మాస్టరుగారికి నమస్కరించి కూర్చున్నాను. అక్కడ మసిబారిన ఒక లాంతరు వుంది, "ఈ లాంతరు వెలిగించనా?" అని అడిగాను. "మీకు తెలియదమ్మా, నేను వెలిగిస్తాను" అన్నారు. కాస్సేపయ్యాక "వాళ్లంతా భోజనాలు చేశారేమో చూద్దాం పదండమ్మా" అన్నారు. సరేనని పూజ్యశ్రీ మాస్టరుగారి వెంటే బయటకి వచ్చాను. అక్కడ మెట్ల పైకి

బాట వుంది. ముందు నేను, వెనుక మాస్టరుగారు వెడుతున్నాము. నేను మనసులో అమ్మగారిని ఇంతవరకు చూడలేదు అని బాధ పడుతున్నాను (పూజ్యశ్రీ మాస్టరుగారు సమాధి అయ్యాక అప్పటివరకు పూజ్యశ్రీ అమ్మగారిని చూడలేదు). వెంటనే పూజ్యశ్రీ మాస్టరుగారు "అమ్మగారిని చూసావా అమ్మా?" అన్నారు. "లేదండి' అన్నాను. కొంత దూరంలో ఎత్తుగావున్న కొన్ని మెట్లు, తలుపు మూసి వున్న గుమ్మం కనిపించాయి. "అదిగో చూసిరా! అమ్మగారు అక్కడే వుంటారు" అన్నారు. నేను ఆ మెట్లెక్కుతూ వెనక్కు తిరిగి చూసాను. పూజ్యశ్రీ మాస్టరుగారు కనిపించలేదు. నేను దిగ్భ్రాంతి చెందాను. "అయ్యో! మాస్టరుగారు వస్తున్నారనుకున్నాను, అమ్మగారు నన్ను గుర్తుపడతారో లేదో!" అనుకుంటూ తలుపు తోసి లోపలకి వెళ్లాను. అక్కడ పూజ్యశ్రీ అమ్మగారు పడుకుని వున్నారు. దగ్గరగా కొంతమంది స్త్రీలు వున్నారు. "అమ్మగారూ! నమస్కారం" అన్నాను. నన్ను చూడగానే పూజ్యశ్రీ అమ్మగారు అక్కడ వున్న స్త్రీలతో, "మనవాళ్ళు అనుకున్నవాళ్ళు ఎప్పుడు వచ్చారో చూడండి" అన్నారు కించిత్తు కోపము, ఆప్యాయతలను మేళవించి. నాకింక దుఃఖం ఆగలేదు, "క్షమించండి అప్పటి నా పరిస్థితులవల్ల రాలేక పోయాను" అంటూ బాగా ఏడ్చేసాను. అప్పుడు పూజ్యశ్రీ అమ్మగారు ఎంతో ఆత్మీయంగా ప్రేమగా మాట్లాడారు. వెంటనే నాకు మెలకువ వచ్చింది. అలా పూజ్యశ్రీ మాస్టరుగారే దగ్గరుండి పూజ్యశ్రీ అమ్మగారి దగ్గరకి చేర్చారు.

పూజ్యశ్రీ అమ్మగారు కొంతకాలానికి హైదరాబాదు వచ్చి, చిక్కడపల్లిలో వుండి, 2004లో మేము ఉంటున్న మల్కాజిగిరికి, విచ్చేసి దాదాపు నాలుగుసంవత్సరాలు వారిసన్నిధి భాగ్యాన్ని ప్రసాదించారు. ఎన్నో అనుగ్రహ ఆశీస్సులు ప్రసాదించారు.

నాకు ఎప్పుడూ శ్రీ గురుచరిత్ర, శ్రీ సాయి లీలామృతం పారాయణ చెయ్యడం అలవాటు. అలాంటిది ఒకసారి శ్రీగురుచరిత్ర ఎన్నిసార్లు మొదలుపెట్టినా ఏదో ఒక ఆటంకం వచ్చేది. ఒకసారి గురుపూర్ణిమకు చదువుదామనుకుంటే, అప్పటికి నాలుగు రోజులేవుంది. అప్పుడు మా అమ్మాయి విజయలక్ష్మి ఈ విషయం పూజ్యశ్రీ అమ్మగారితో చెప్పింది. "సరే, ఇప్పుడు మొదలుపెట్టి చదవమను" అని అన్నారుట. "గురుపూర్ణిమ ఇంక నాలుగురోజులే వుంది కదా! చదవలేదేమో అమ్మగారూ!" అని విజయలక్ష్మి అంటే, "ఎందుకు చదవలేదు? చదువుతుంది" అన్నారట. అలాగే పూజ్యశ్రీ అమ్మగారి వాక్ఫలితం, నాలుగురోజులలో అంటే గురుపూర్ణిమకు గురుచరిత్ర పారాయణ పూర్తిచేయగలిగాను. అంతే కాదు, అదేరోజు పూజ అనంతరం, ధ్యానంలో పూజ్యశ్రీ అమ్మగారు దర్శనం ప్రసాదించి నన్ను ధన్యురాలిని చేశారు.

ఒకొక్కసారి ఇప్పుడున్న పరిస్థితులని, సమస్యలని, తలచుకుంటే ఒకింత మనసు ఆందోళనకి గురి అవుతూ ఉంటుంది. అప్పుడు ఆ గురుదేవుని నమ్ముకుని, వారిపై భారం వెయ్యడం తప్ప చెయ్యగలిగినదేముంది? అనిపిస్తుంది. ఒకరోజు నిద్రకుపక్రమించిన వెంటనే అద్భుతమైన స్వప్నం! ఒక పెద్ద హాలులో మంచం మీద పూజ్యశ్రీ అమ్మగారు, తేజోమయ రూపంతో, దరహాస వదనంతో దర్శనం యిచ్చారు. నాతో ఏదో మాట్లాడారు కానీ, గుర్తులేదు. గుండెలమీద చేతులు పెట్టుకుని, "నేను వున్నానుగా, నేను వున్నానుగా" అని నాతో రెట్టించి అన్నారు. వెంటనే నాకు మెలకువ వచ్చేసింది. పూజ్యశ్రీ అమ్మగారు ఆ విధంగా అభయం ఇచ్చి నా మనసులోవున్న ఆందోళన, అశాంతి పోగొట్టారు.

ఇలా ఎన్నెన్నో సందర్భాలలో, మమ్మలిని ఆదుకుంటూ, వారి దర్శన భాషణములతో అనుగ్రహిస్తున్న పూజ్యశ్రీ అమ్మగారు నాగోలుకి తరలివెళ్లారు. వారి వెనుకే మేమూ నాగోలు చేరుకున్నాం.

పూజ్యశ్రీ అమ్మవారి అనుగ్రహం ఎప్పటికీ వుండాలని, వారు ఆశించిన బాటలో మా జీవితాలు నడవాలని, ప్రార్థిస్తూ వారి పాదపద్మములకు ప్రణామములర్పిస్తున్నాను.

జై సాయి మాస్టర్!!



మార్గదర్శి

శ్రీ సూర్యప్రకాష్

(విద్యానగర్ కాలేజీలో లెక్చరర్ గా పనిచేసిన వీరు "ఎంతో మేధాసంపన్నులైన మాస్టరుగారితో నా పూర్వజన్మ పుణ్య ఫలితంగా కలిగిన ఎన్నో సంవత్సరాల సాంగత్యంలో నా జీవితం పునీతమయిందన్న ఆనందాన్ని, నా అదృష్టాన్ని ఏమని వర్ణించగలను?" అంటూ వారితో గల అనుబంధాన్ని గురు బంధువులతో పంచుకున్నారు.)

నేను 1968వ సంవత్సరంలో విద్యానగర్ లోని ఎన్.బి.కె.ఆర్. కాలేజిలో లెక్చరర్ గా చేరాను. మా మేనల్లుడు మాస్టార్ గారి విద్యార్థి. అతని వల్లనే నేను మాస్టార్ గారి దగ్గరకు 1972 వ సంవత్సరంలో రావటం జరిగింది. ఈ లోపల అంటే 1972 వరకు నేను చాలా ఐహికంగా బ్రతికాను.

ఆయన గొప్ప విద్యావేత్త. His arguments are meticu-lous and nobody can argue with him. ఆయన స్టేట్-మెంట్స్ ని సబ్-స్టాన్షియేట్ చేస్తారు. ఆయన ఐ.ఎ.యస్ పాసయ్యారు. ఇంటర్వ్యూలో వారిని, "కుటుంబ నియంత్రణ అమలు పథకము పై మీ అభిప్రాయ మేమిటి?" అని అడిగారు. అప్పుడు మాస్టార్ గారు, "ముందుగా ఆ పథకము అమలు పరచటంలో గల కష్టనష్టాలని, ఎదురయ్యే యిబ్బందుల గురించి, పరాజయాల గురించి చెప్పి ఆ సమస్యలను ఎలా అధిగమించాలో వాటిని మనకనుకూలంగా ఎలా మలచుకోవాలో చెప్పారు. "ఆ కార్యక్రమం అమలు పరచేముందు ప్రజలలో తత్సంబంధమైన సాహిత్యం వ్యాప్తి చేసి, వారికి సమగ్రమైన అవగాహన కలిగించాలి. దీనికి కేటాయించబడిన ధనమును దుర్వినియోగ పడకుండా కొంతమంది స్వాహా చేయడానికి వీలులేని విధంగా కార్యక్రమాన్ని అమలు పరచగలిగినట్లయితే ఈ కార్యక్రమం విజయవంతమై సత్ఫలితాన్ని యిస్తుంది." అని వివరించారు. ఎంతటి సమస్యలనైనా కూలంకషంగా ఆలోచించి మంచి సలహాలివ్వ గల మేధావి మాస్టార్ గారు.

విద్యానగర్ వచ్చేనాటికే ఆయన సాధనంతా పూర్తి అయినట్లు అన్పించేది. కాలక్రమేణా ఆయనతో సాహచర్యం పెరిగేకొద్దీ ఆయనెంతో మహనీయుడన్నది సుస్పష్టంగా తెలిసి వచ్చింది. ఆయన రచనలు, భావాలు ఒక క్రమమైన పద్ధతిలో పట్టుకొచ్చారు. సహజంగా ఎవరైనా ముందు దేవుడి దగ్గరకు కాని, గురువు దగ్గరకు కానీ లౌకికమైన కోరికలు తీర్చుకునేందుకే వస్తారు. అలాంటివారికి వారు 'సాయి లీలామృతము', 'గురుచరిత్ర' లను

పారాయణ చేయమని చెప్తారు. అలా వారికి లౌకికపరమైన కోరికలు తీరి మనస్సుకు స్థాయి చిక్కుతుంది. వీరికి ఒక మార్గము, ధ్యేయము చూపిస్తే వాళ్ళే సాయి తత్వానికి పునాదులౌతారు. లౌకికపరమైన కోరికలు తీరితే వారు క్రమక్రమంగా స్థిరపడి ఆధ్యాత్మిక వైపుకు తిరుగుతారన్న దృఢమైన నమ్మకమున్న వ్యక్తి ఆయన. వారిని అర్థం చేసుకోవటము మనకు సాధ్యమయ్యే పని కాదు.

ఆయన రచనలలో ముఖ్యంగా "సాయి ప్రబోధామృతము" చాలా గొప్ప గ్రంథము. ఆ గ్రంథం వారి ఆధ్యాత్మిక స్థాయికి చిహ్నం. దాన్లో ఆయన అన్ని మతాల సామరస్యాన్ని పొందుపరచారు. వారు ఫోర్త్-ప్లేన్ లో కెళ్ళి అతీతస్థితిలో వ్రాసిన గ్రంథమిది. శంకరుల భాష్యం గురించి, క్రీస్తు గురించి, సాయి సాంప్రదాయాన్ని గురించి బోధ పరచారు. మాస్టార్ గారి రచనలన్నింటిలోకి కొంచెం క్లిష్టతరమనిపించి ఆ మూడు మత సిద్ధాంతాల సారాన్ని అర్థం చేసుకున్న వారే వారి భావాన్ని అందుకోగలరన్పించే గ్రంథమది. చదివిన ప్రతిసారి అందులో కొత్త విషయాలు తెలుస్తుంటాయి. నేను చాలా మందిని అడిగాను. "ఏమండి, మీకు ప్రబోధామృతము అర్థం అయ్యిందా? నేను చాలాసార్లు చదివినా దాన్లోని వివరణను అందుకోలేకపోయాను" అని అడిగితే, "మాకూ అలానే వుందండి. కొంచెం క్లిష్టంగానే వుంది" అని చెప్తున్నారు తప్పిస్తే, ఆ గ్రంథాన్ని పూర్తిగా అవగాహన చేసుకున్న వారెవరూ నాకు కన్పించలేదు. ప్రబోధామృతం సాయితత్వం యొక్క సారాంశమే!

అందువల్ల మాస్టార్ గారినే "తెలుగులో మీరు వ్రాసిన సాయినాథ ప్రబోధామృతం ఆంధ్ర దేశానికే పరిమితం కాకూడదు సార్. యావత్ప్రపంచానికి దీన్ని అందజేయాలి వ్యాపింపచేయాలి" అని ఎన్నోసార్లు కోరాను. "అలాగే.. అలాగే... చూద్దాం. చూద్దాం" అనేవారు. వారి రచనలన్నిటినీ దేశమంతటా కాదు, ప్రపంచమంతటా వ్యాప్తి చెందేలా అన్ని భాషలలోకి అనువదించాలి.

గృహస్థు జీవితాన్ని గడుపుతూ ఆధ్యాత్మికతని ఎలా నిలుపుకోవాలి, ఈ రెండు కార్యక్రమాలని ఎలా మేళవింపు చేసుకొని దైనందిక కార్యక్రమాలని నిర్వహించుకోవాలని ఎంతగానో వివరించి చెప్పేవారు. అప్పుడప్పుడూ ఈ రెంటికి క్లాష్ వస్తుంది. అలా వచ్చినప్పుడు మనం ప్రతిక్షణం జాగ్రత్తగా డెసిషన్స్ తీసుకోవాలి. మనం లౌకికంగా వెళ్తున్నామా? ఆధ్యాత్మికంగా వెళ్తున్నామా? మన యోచనలో ఈ రోజుకు, నిన్నటికి ఎలాంటి మార్పు వచ్చింది? అని బేరీజు వేసుకుంటూ ముందుకు సాగాలి. సాధకులకు, మాస్టార్ గారు ముఖ్యంగా ఏం చెప్పారంటే ఇరవై నాలుగు గంటలు సాయి సాధనలో, సాయి తత్వంలో ఎలా జీవితాన్ని చరితార్థం చేసుకోవాలో వివరించేవారు. "కొంతసేపు భజన చేయి, కొంచెం సేపు రచన చేయి, కొంచెం సేపు గేయం పాడు, కొంత సేపు చరిత్ర పారాయణ చేయి, కొంత సేపు సత్సంగం చేయి" అని చెప్పేవారు. ఒకసారి "సాయి చరిత్ర గాని, గురు చరిత్రగాని చేత్తో వ్రాసి, దాన్ని షిరిడీలో ఎక్కడన్నా వదిలేయ్. అది ఎంతో మంచి సాధన" అన్నారు. "అలా రోజూ క్రమక్రమంగా చేస్తూంటే మనస్సు బాబా మీద లగ్నం అవడానికి ఎక్కువ అవకాశం వుంటుంది" అన్నారు. నేను, నా భార్య గాణగాపూర్ లో యిలా చేశాం. మాస్టార్‌గారు చెప్పిన యీ సాధనను మేము ఎక్కువగా చేస్తుంటాము. పారాయణ చేస్తూంటే మనసు గృహకృత్యాల మీద, యింటి మీద, యింకా యింకా అనేక లౌకిక విషయాల మీదకు పోతూంటుంది. ఈ పారాయణ అంతా ఒక ఫిజికల్ డ్రిల్లింగ్ లా అయి యిది తెలిసిందే కదా! అని దాటేస్తుంటాం. అలా కాకుండా మనస్సు బాబా మీద నిలబడాలంటే ముఖ్యంగా బాడీ, మైండ్ అండ్ ఇంటలెక్ట్ ఒకే స్థాయిలో వుండాలంటే వ్రాయటం అన్నది ఒక మంచి మార్గం అన్నది మాకు అనుభవమైంది.

ఆడవారు గృహకృత్యాలు చేసుకుంటారు. గనుక వారి సాధన గురించి అడిగితే, "రోజూ గంటో, అరగంటో సాయి నామస్మరణతో బియ్యం చేస్తూ వాటిని నెలకోసారి పేదలకు దానం చేసినా చెయ్యవచ్చు, లేదా వాటిని వండి బాబాగారికి నైవేద్యం పెట్టి ఏ గుడి దగ్గరన్నా పంచవచ్చు. ఆడవారికి అంతకు మించిన సాధనేదీ లేదు" అన్నారు.

- సశేషం

రాధాకృష్ణ ఆయీ

పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

ఆధ్యాత్మిక సాధనలో ఎన్నో మెలుకువలు తెలిసిన వివేకి రాధాకృష్ణ ఆయీ. నిత్యమూ సాయిసన్నిధిలో నివసించే భక్తులకు ఎదురయ్యే ప్రమాదాలు గుర్తించి భక్తులు వాటిని నివారించుకొనే సాధనాలు ఏర్పరచింది. సాయి సంపూర్ణమైన భగవదవతారమైనా, భక్తులతో సామాన్యమానవునిలా మసలుకొనేవారు. అతి పరిచయం వలన భక్తులు వారి దివ్యత్వాన్ని మరచి వారి సన్నిధిని సద్వినియోగ పరచుకోలేకపోయే ప్రమాదమున్నది. నిజానికి స్థానికులెందరో కాలగతిలో యిట్టి అశ్రద్ధకు లోనై బాబావద్ద నిత్యమూ సమకూడే డబ్బుపై ఆశతో ఎంతో హీనంగా ప్రవర్తించారు. అట్టిది నివారించుకోవాలంటే భక్తులు నిత్యమూ సాధ్యమైనంత తరచుగా, సాయి ఎంతటివారో హృదయపూర్వకంగా స్మరించి, ఆయనతో ఆ ప్రకారమే నడచుకోవాలి. అందుకే నిత్యమూ మహావైభవంగా సాయికి సామూహిక పూజ, నాల్గు ఆరతులు, చావడి ఉత్సవము చేసుకొనడం భక్తులకు సత్సంప్రదాయంగా యీమె నెలకొల్పింది. అదే శిరిడీలోనూ, అన్ని సాయి మందిరాలలోనూ నేటికీ కొనసాగుతున్నది. ఈమెకు కల్గిన ఈ సత్సంకల్పానికి బాబాగూడ ఆమోదముద్ర వేశారు. అందుకే కృష్ణశాస్త్రి జగేశ్వర్ భీష్మకు ఆయన దివ్యమైన ప్రేరణయిచ్చి ఆరతి పాటలు వ్రాయించుకున్నారు. మొదట మేఘునిచేత, తర్వాత బాపూసాహెబ్ జోగ్ చేత నిత్యమూ విధిగా ఆరతులు ఆయన జరిపించేవారు. ఎవరు ఆరతికి హాజరు కాకపోయినా ఆయన ప్రత్యేకించి

హెచ్చరించేవారు. మంద-బుద్ధులకు అది ఆత్మ ప్రశంసగా తోచవచ్చుగాని, నిజానికి శిరిడీ ఎవరెందుకొచ్చారో గుర్తుంచుకొని వారది సార్థకంచేసుకోవాలని మాత్రమే సాయి భావం. మీనతాయిని ప్రసవవేదననుండి రక్షించడానికి, బాబా ఊదీతోపాటు 'ఆరతి సాయిబాబా' అను ఆరతి పాటగూడ వ్రాయించి పంపారు. సాయి తమకు - తమ పటానికి భేదం లేదని ఎన్ని నిదర్శనాలిచ్చినా అది చదివాకగూడా మనకట్టి శ్రద్ధాభక్తులు క్రమంగా సన్నగిల్లే ప్రమాదమున్నది. వీటన్నింటికీ పరిష్కారం రాధాకృష్ణ ఆయీ ఆనాడే మనకందించినది. లౌకిక తలంపులతోనూ, భావాలతోనూ మలినమైన మన మనస్సులు ఆరతులనుగూడ యాంత్రికంగా చేసే ప్రమాదమున్నది. ఆ సద్గురుమూర్తిని నిత్యమూ అలంకరించి, పూజించడమొక్కటే ఉత్తమమైన పరిష్కారమని తెలిసే, ఆమె భక్తులచేత అలా చేయించింది. అందుకోసం రాజదర్బారులో వుండవలసిన లాంఛనాలు, అలంకారాలూ భక్తులే సాయి సంస్థానానికి సమర్పించేలా చేసింది. ఈ విషయం ఖాపర్డే డైరీ నుండి ఉదహరించిన పుటలలో చూడవచ్చు.

నిజానికి ఆయీ శిరిడీలో గడిపినది మొత్తం తొమ్మిది సం॥లు మాత్రమే. కారణం ఆమె తన 35వ యేటనే ఈ లోకయాత్ర విడిచింది. బహుశా సాటిలేని సద్గురువైన సాయి ఈ జగన్నాటక రంగం నుండి నిష్క్రమించిన తర్వాత ఈ జగన్నాటకమిక ఆమె



చూడదలచుకోలేదు కాబోలు! మిగిలిన భక్తులందరూ కలసి 52 సం॥లలో సాధించలేని సాయి సంస్థాన వైభవం ఆమె 9 సం॥లలో సాధించింది.

సద్గురువును కీర్తించి వారి మహిమను లోకానికి వెల్లడి చేయడం గురుసేవలో ముఖ్యమైన అంశమని 'శ్రీ గురుగీత' చెప్పినది విశ్వసించి రాధాకృష్ణ ఆయీ అలానే చేసేది. సాటి మానవులు సాధ్యమైనంత సాయి అనుగ్రహనికి పాత్రులై సుఖశాంతులు పొందాలని ఆమె ఆశించింది. ఇలా చేస్తున్న నానాసాహెబ్ చందోర్కర్, దాసగణు, కాకా దీక్షిత్ లను ఆమె ఎంతగానో ప్రశంసించి ప్రోత్సహించేది. అలా చేయమని శ్రీ సాయి శరణానందులను, రేగేను గూడ ప్రోత్సహిస్తుండేది. ఇట్టి ప్రయత్నాల వలన అప్పుడప్పుడు భక్తులు కొన్ని సమస్యలు ఎదుర్కొనవలసి వచ్చేది.

అవస్తే:

ఒకసారి గ్వాలియర్ లో జడ్జీగా రిటైరయిన పి.ఆర్. అవస్తేను శిరిడీకి తీసుకురమ్మని రేగేతో ఆమె చెప్పింది. అవస్తే ఆధ్యాత్మిక చింతన గలవాడేగాని శాస్త్ర వాక్యాలకు సంకుచితమైన అర్థాలు ఊహించుకొని స్వబుద్ధితో తన పురోగతికి తానే అవరోధాలు కల్పించుకున్నాడు. ఈ సందర్భంలో యితడి గురించి కొంతవరకు పూర్వాపరాలు తెలుసుకొనడం అవసరం.

పూణేకు చెందిన పురుషోత్తం.ఆర్.అవస్తే (జననం 1870) సుమారు రెండు దశాబ్దాలు సత్పురుష సాంగత్యం పొందాడు. ప్రభుత్వోద్యోగియైన యశ్వంతరావ్ భాస్కర్ ఉరఫ్ దేవ్ మామ్లేదార్ (సతారా) అను సత్పురుషుని తన 6వ సంవత్సరంనుండే ఆయన దర్శించేవాడు. ఉదాహరణకు: ఒకసారి ఉదారుడైన దేవ్ మామ్లేదార్ ఒక పేదవాని వివాహనికి ప్రభుత్వనిధి నుండి ధనసహాయం చేసాడు. సమయానికి తనవద్ద పైకం లేకపోవడంతో తన పైకం అందగానే ప్రభుత్వ ఖజానాలో జమ చేయవచ్చని తలచి అతడలా చేసాడు, కాని గిట్టని వాళ్ళు ఫిర్యాదు చేయడంతో ఒకనాడు దేవ్ మామ్లేదార్ తనయింట పూజలో వుండగా జిల్లా కలెక్టరు అకస్మాత్తుగా ఆఫీసుకొచ్చి తనిఖీ చేసాడు. దైవలీలవలన ప్రభుత్వ ఖజానాలో ఎట్టి కొరవా కన్పించలేదు. సుమారు 20 సం॥వరకూ తరచుగా అవస్తే యీయనను దర్శిస్తున్నా ఆ తర్వాత విద్యార్థి దశలో అతని విశ్వాసం సడలింది. ఒకరోజు అకస్మాత్తుగా భగవద్గీత చదివాక అతనిలో తీవ్రమైన భగవదన్వేషణ ప్రారంభమైంది. ఒకనాడు అతని మేనమామ ఆ కాలంలో జీవిస్తున్న మహాత్ముల గురించి చెప్పాక, దానికితోడు 1906లో మహాత్ముల చరిత్రలు శ్రద్ధగా చదివాక శ్రీ దోండి మహరాజ్ (పలూస్)ను దర్శించాడు. అవస్తే. దారిలో భగవద్గీత (శ్లో. 4-34) మహాత్ములు ఆత్మ సాక్షాత్కారం ప్రసాదించగలరని చదివి ఆ సిద్ధపురుషుని పరీక్షించదలచాడు. కాని పలూస్ లో ఒక ఆలయం వెలుపల కూర్చునివున్న దోండీ మహరాజ్ ను చూడగానే ఆయన శూద్రుడని తలచి ఆయనకు నమస్కరించలేదు. అతనిని ఆలయంలోకి వెళ్ళమని ఆయన గద్దించారు. ఇంతా చూస్తే ఆలయంలో పూజింపబడుతున్నది వారి పటమే! అయినా అవస్తే ఆయనను ఆశ్రయించ లేకపోయాడుగాని, "స్వామి, మీకంతటి దివ్యశక్తి యెలా వచ్చింది?" అని మాత్రం అడిగాడు. ఆయన "రామ్, రామ్, రాజారామ్, సీతారామ్ అని స్మరిస్తూండు, సర్వమూ సిద్ధిస్తుంది" అని చెప్పి, తాము ఎవరికీ గురువు కాదల్చలేదని చెప్పి ఆశీర్వదించి పంపారు.

- సశేషం

స్వామికి మొక్కిన మొక్కు

తంజావూరు సంతానరామన్

ఒకసారి నా భార్యకు తీవ్రమైన ఆరోగ్య సమస్య వచ్చింది. వైద్యులు వెంటనే ఒక పెద్ద శస్త్రచికిత్స చెయ్యాలి అన్నారు. తిరుచ్చిలోని ఒక ప్రముఖ ఆసుపత్రిలో తనని చేర్చాను. మరుసటిరోజు శస్త్రచికిత్స చేయాలని నిర్ణయించారు. ఆసుపత్రిలో నేను, నా భార్య మాత్రమే ఉన్నాము. ఆమెను శస్త్రచికిత్సకు తీసుకునివెళ్లారు. బాధతో, ఆందోళనతో మనస్సు కకావికలమైపోయింది. మా ఇంటి దైవమైన ఏడుకొండలస్వామిని ప్రార్థించాను. కానీ మనస్సు కుదురుగా ఉండడంలేదు. హఠాత్తుగా కంచి పరమాచార్య చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామివారు గుర్తుకొచ్చారు. స్వామివారే తనని కాపాడాలని, శస్త్రచికిత్స విజయవంతమైన తరువాత ఇద్దరమూ వచ్చి ₹1,008/- కానుకగా సమర్పిస్తామని ప్రార్థించాను. ఒకటిన్నరగంట తరువాత శస్త్రచికిత్స ముగియగానే సాధారణ వార్డుకు మార్చారు.

"మేము ఏదేదో అనుకున్నాము కానీ, ప్రాణానికి ఏమాత్రం ప్రమాదం లేదు. శస్త్రచికిత్స విజయవంతమైంది" అని వైద్యులు నాతో చెప్పారు. వెంటనే నేను ఏడుకొండలవాడికి, పరమాచార్య స్వామివారికి మనస్సులోనే సాష్టాంగం చేశాను. మూడు రోజుల తరువాత ఆసుపత్రి నుండి ఇంటికి వచ్చాము.

తరువాత గోకులాష్టమి పండగ వచ్చింది. మనం కాంచీపురం వెళ్ళి, అక్కడి సేవకులకి మురుకులు, వెన్న గుళ్ళు ఇచ్చి, స్వామివారిని దర్శించుకుందామని నా భార్యకు చెప్పాను. అన్నిటినీ తీసుకుని శివాస్థానం చేరుకున్నాము. ఉదయం దర్శనం తరువాత ఏడుగంటలకి అనుష్ఠానానికి కూర్చున్నారు స్వామివారు. స్వామివారు అనుష్ఠానం కోసం శివాస్థానంలో ఒక పాకలోకి వెళ్ళడం మేము బయటినుండే చూశాము. నా విన్నపాన్ని స్వామివారికి ఎలా తెలియజేయాలో నాకు పాలుపోలేదు. అక్కడే ఉన్న ఒక సేవకుడిని పిలిచాను.

"స్వామివారికి చెప్పాలంటే నాకు సిగ్గుగా ఉంది. నేను స్వామివారికి కానుక మొక్కుకున్నాను. నా భార్యను కాపాడారు. నేను కానుకను సమర్పించాలి; ఎలా చెయ్యాలో నాకు తెలియదు. మంచి సమయం చూసుకుని నువ్వు స్వామివారితో చెప్పి వారి ఆదేశాన్ని నాకు తెలుపు" అని చెప్పాను.

స్వామివారి అనుష్ఠానం పూర్తవగానే, ఆ సేవకుడు గట్టిగా, "తంజావూరు సంతానం వచ్చాడు. స్వామివారికి విజ్ఞాపన చెయ్యడానికి సిగ్గు పడుతున్నాడు. అతని భార్యకు పెద్ద శస్త్రచికిత్స జరిగిందని చెప్పాడు. ఆ సమయంలో ఆమెను కాపాడమని స్వామివారికి కానుక మొక్కుకున్నాడు. దంపతులిరువురూ బయట నించున్నారు" అని చెప్పాడు.

మహాస్వామి వారు నవ్వుతూ, ఛాతీని ముట్టుకుని "నాకు మొక్కుకున్నాడా? ఎంత మొత్తమో అడుగు?" అన్నారు. "₹1,008/- కానుక మొక్కుకున్నాను" అని చెప్పాను.

"ఆ ధనం తీసుకునివచ్చాడేమో అడుగు?"

"వెంట తెచ్చాను"

ఈ సంభాషణ అంతా విని నా భార్య నావైపు అయోమయంగా చూసింది. నా మొక్కు గురించి ఆమెకు తెలియదు.

మేము అక్కడ ఉంచిన పళ్ళు, టెంకాయలు మరియు ఇతర పదార్థాలను రెండు పెద్ద పెద్ద పళ్లాలలో సర్దమని చెప్పారు స్వామివారు. "ఇక్కడ ఋగ్వేద పారాయణం చేసే శాస్త్రిగారిని పిలవండి" అని ఆదేశించారు. శాస్త్రిగారు రాగానే, మమ్మల్ని జంటగా నిలబడి ₹504/- ఒక పళ్ళెంలో ఉంచి ఆ శాస్త్రిగారికిచ్చి నమస్కరించమన్నారు.

శ్రీమద్భాగవతం పారాయణం పూర్తిచేసిన మరొక శాస్త్రిగారిని పిలిపించి, మరొక్క పళ్ళెంలో ₹504/-. ఉంచి ఆ శాస్త్రిగారికిచ్చి నమస్కరించమన్నారు.

తరువాత మందహాసంతో, అక్కడున్నవారికి వినబడేటట్లుగా "ఇది విన్నారా! ఇతను చెబుతున్నాడు ఇతని భార్యకు ఒక పెద్ద శస్త్రచికిత్స జరిగింది. అందుకోసమని నాకు మొక్కుకుని ₹1,008/- కానుకగా నాకు సమర్పించడానికి తెచ్చాడు. అందరూ దేవునికి, దేవాలయానికి మొక్కు చెల్లిస్తారు. చూడండి ఇతను నాకు మొక్కుకున్నాడంట!" అని గట్టిగా నవ్వగానే, అక్కడునవారందరూ స్వామివారితో శృతి కలిపారు.

స్వామివారు మాకు పూర్ణ అనుగ్రహాన్ని ఇచ్చి, "వెళ్లిరండి" అని ఆశీర్వదించారు. ఎప్పటికీ నా కళ్లెదుటన ఉండే ఒక అపురూపమైన సంఘటన యిది.●

మాతృదేవి మహాసమాధి

15వ పేజీ తరువాయి

గుడారాలు పోయి, గృహాలు వచ్చాయి. విద్యుత్తు, నీటి సౌకర్యాలు ఏర్పడ్డాయి. పూజ్యశ్రీ అమ్మగారి సమాధి పాలరాతి కట్టుబడి జరిగింది. అక్టోబర్ నెలలో పూజ్యశ్రీ మాస్టరు గారి జయంతి నించి, వేరే ప్రదేశాలలో ఉన్న గురుబందువులు కొంతమంది చొప్పున వచ్చి సన్నిధిలో కొద్ది రోజులుండి నిత్యసేవలు చేసుకునే భాగ్యం కూడా కల్పించబడింది. మొన్న జరిగిన March 6 గురు దంపతుల దివ్యకళ్యాణ మహోత్సవానికి, 'భక్త నివాస్' కూడా ఏర్పడింది.

ఇదివరకు నాగోలులో జరిగినట్లే, ప్రతి పండుగ, పూజ్యశ్రీ మాస్టరుగారి జయంతి, ఆరాధన, పూజ్యశ్రీ అమ్మగారి జయంతి అన్నీ అమ్మగారి సన్నిధిలో యథావిధిగా జరుగుతున్నాయి. అంతేకాకుండా, నామకరణాలు, అన్నప్రాసనలు, పుట్టిన రోజులు, అక్షరాభ్యాసాలు, వివాహం నిశ్చితార్థాలు ఎంతో వైభవంగా, దూరప్రాంతాల నించి వచ్చి కూడా మాతృదేవి సన్నిధిలో శ్రీమతి వేదమ్మగారు, శ్రీ ద్వారకబాబు గారి నేతృత్వంలో ఆనందంగా జరుపుకుంటున్నారు.

పూజ్యశ్రీ అమ్మగారు మహాసమాధి చెంది సంవత్సరం కావస్తోంది. అంటే గుమ్మళం పాడు అనే గ్రామ పరిసర ప్రాంతానికి వచ్చి.. సమాధిస్థితులై... సంవత్సర కాలం! కానీ వచ్చిన మర్నాటినించే నిత్యకైంకర్యాలు, పండుగలు, ఉత్సవాలు యథావిధిగా జరగడం చూస్తుంటే... ఆ సన్నిధి ప్రభావం ఎంతటిదో అర్థం చేసుకోవచ్చు. ఆ చుట్టుపక్కల గ్రామాలలోని భక్తులైతే "ఆ తల్లి మాకోసం ఇంత దూరం వచ్చినందుకు, ఆయమ్మ ఋణం ఎలా తీర్చుకోగలం?" అంటారు. అంటే వారికి 'అమ్మ' సాక్షాత్తు, అక్కడ కొలువైవున్న భావన! పొరపాటున కూడా 'సమాధి' అన్న పదం వాడరు.

వారికి అంతటి భావాన్ని కలిగించిన పూజ్యశ్రీ అమ్మగారు ఎంతటి వారై వుండాలి? వాళ్ళకే కాదు, పూజ్యశ్రీ అమ్మగారిని ప్రత్యక్షంగా చూసిన వాళ్ళు, "ఇంక మనకి అమ్మగారు కనిపించరుగా!" అని బాధ పడుతుంటే.... `నేనున్నాను, ఎక్కడికీ వెళ్లలేదు" అని ఎన్నో లీలల ద్వారా, తెలియచేస్తున్న అమ్మగారి ప్రభావం ఎంతటిదో? సాక్షాత్తు సమర్థ సద్గురు సాయినాధుని చేత, సద్గురు భరద్వాజుని చేత సుధీంద్ర బాబుగారి లాంటి ఎందరోమహాత్ముల చేత కొనియాడబడిన పూజ్యశ్రీ అమ్మగారు 'నిత్యసత్యులు' కాక మరేమిటి?

అటువంటి అలివేలు మంగమ్మ తల్లి సన్నిధిని దర్శించడం, అక్కడ ప్రసాదం స్వీకరించడం, మన సమయాన్ని ఆ సన్నిధిలో గడపడం ద్వారా విలువైన కాలాన్ని సద్వినియోగం తీసుకోవడం, ఏ చిన్న సేవలోనైనా పాల్గొనడం... ఇవన్నీ ఎంతో అత్యుత్తమ, అత్యున్నత, అరుదైన అవకాశాలు. అంతటి సువర్ణ అవకాశాల్ని అమ్మ సన్నిధిలో తనివితీరా పొందుతూ, మాతృదేవి ఆరాధనా మహోత్సవాన్ని అంబరాన్నంటే సాధనాపరమైన సంబరాలతో జరుపుకుందాం !!●

ద్వారకామాయి అనుభవమండపము

వి. శేషగిరిరావు (నెల్లూరు)

నేను, నా భార్య 1988 సం॥లో శివరాత్రికి నెల్లూరు నుండి శ్రీశైలానికి బయలుదేరి ఒంగోలులో దిగి శ్రీ భరద్వాజ మాస్టర్‌గారి దర్శనం చేసుకొన్నాము. ఆయన మమ్మల్ని ఆశీర్వదించి శ్రీ పూర్ణానందస్వామిని దర్శించమని చెప్పి వారికి సమర్పించమని "శ్రీ గురుచరిత్ర", "శ్రీ దత్తావతార మహాత్మ్యం", "శ్రీ శిరిడీక్షేత్ర సందర్శనము", "శ్రీ సాయిబాబా జీవిత చరిత్ర" నాకిచ్చి పంపారు. మేము ఆ రాత్రికి శ్రీశైలం చేరాము.

శ్రీశైలంలో మేము జీవితంలోనే మరువలేని నిదర్శనాలు లభించాయి. ఆ క్షేత్రంలోనే శ్రీ గురుడు అంతర్ధానమైన సంగతి స్మరించి, శివరాత్రి 10-30 గం॥ లోపున "శ్రీ గురుచరిత్ర" పారాయణ చేసి దత్తస్వామికి అగరవత్తి మాత్రం సమర్పించాను. అక్కడ దక్షిణ సమర్పిస్తే మేము తిరిగి నెల్లూరు చేరేసరికి అది మిగిలిన డబ్బులతో కలసి పోతుందేమోనని తలచి నెల్లూరు చేరాక దక్షిణ సమర్పించాలనుకొన్నాను. తర్వాత అచ్చటి సత్రం వరండాలో కూర్చొని అందరితోను మాట్లాడుతున్నాను. ఇంతలో ఒక నల్లని బ్రాహ్మణుడు తిన్నగా నా వద్దకేవచ్చి, అక్కడవున్న మరెవ్వరినీ అడగకుండా, నన్ను మాత్రమే 2 రూ॥లు ఇవ్వమని అధికారపూర్వకంగా అడిగాడు. నేను మాటలలో పడి ఆ వచ్చినది స్వామి అన్న గుర్తింపు లేక అతి సామాన్యంగా నా జేబులోనున్న 1 రూ॥ సమర్పించాను. ఆయన "ఏమిటయ్యా, 2 రూ॥లు అడిగితే రూపాయిస్తావు?" అన్నాడు. అప్పటికీ నేను గుర్తించక, "ఇప్పుడు లేదు ఇది తీసుకువెళ్ళండి!" అని సాధ్యమయినంత మర్యాదగా చెప్పి పంపివేసాను. ఆయన వెళ్ళగానే నా భార్య నన్ను ప్రక్కకు పిలచి, "దత్తాత్రేయ స్వామి వచ్చి దక్షిణ అడిగితే అలా అంటారేమిటి? ఇప్పుడే కదా "శ్రీ గురుచరిత్ర" పారాయణ చేసారు. ఊరికి వెళ్ళాక దక్షిణ ఇద్దామని మీరు అనుకుంటుంటే ఆయనేవచ్చి అడిగారు కదా, ఇవ్వకుండా తిప్పి పంపారేమి?" అన్నది. వెంటనే నా పొరపాటు గుర్తించి స్వామికి క్షమాపణ చెప్పుకొని, "స్వామి నీవు వచ్చి మిగిలిన దక్షిణ స్వీకరించాలి లేకుంటే నేనీరోజు భోజనమే చేయను!" అని మనస్సులోనే చెప్పుకొని మరొక రూపాయి కుడిచేతిలో పట్టుకొని అలానే కూర్చున్నాను. భోజనం వడ్డించి అందరూ తినడం ప్రారంభించినా గూడ నేను అలానే కూర్చున్నాను. కొద్దిసేపట్లో ఆ బ్రాహ్మణుడే వచ్చి నా ప్రక్కనున్న వారితో ఏమో మాట్లాడుతూ క్రీగంటగా నన్ను పరీక్షగా చూస్తున్నాడు. నేను వెంటనే ఆయన చేయి పట్టుకొని "స్వామి, నన్ను క్షమించు, నిన్ను గుర్తించలేపోకయాను" అని చెప్పి దక్షిణ వారిచేతిలో వుంచాను. ఆయన చిరునవ్వుతో వెళ్ళిపోయారు. ఆ తర్వాత మరల ఆయన కనిపించలేదు. శ్రీశైలంలో మాకు స్వామి దర్శనమిచ్చారు.

తర్వాత మేమిద్దరమూ సున్నిపెంటలోని శ్రీ పూర్ణానందాశ్రమానికి వెళ్ళాము. స్వామివారి ప్రధాన శిష్యుడైన శ్రీ రాధాకృష్ణమూర్తిగారితో, "మేము నెల్లూరు నుంచి వచ్చాము. భరద్వాజ మాస్టరుగారు స్వామిని దర్శించమని

చెప్పారు" అని చెప్పాను. ఆయన "స్వామి ఇప్పుడు దర్శనమివ్వరు, సాయంత్రం 5 గం॥లకి రండి" అన్నారు. స్వామి అప్పుడు మౌనంలో వున్నారని, విడిగా ఎవరికీ దర్శనం ఇవ్వడంలేదని చెప్పారు. ఎన్నో ప్రాంతాల నుండి వేలాది భక్తులు అక్కడ జరుగుతున్న యజ్ఞానికి వచ్చియున్నారు.

సాయంత్రం 5 గం॥లకు మేమూ మా బంధువులు ఆశ్రమానికి వెళ్లగానే రాధాకృష్ణమూర్తిగారు, "ఉదయం మీరు అటు వెళ్ళగానే స్వామివారు, "శిరిడీ నుంచి మనకొక సందేశము వచ్చివుండాలే, వచ్చిందా" అని ప్రశ్నించారు. నేను ఆశ్చర్యపోయాను. "ఆ తర్వాత ఆయన లోపలనున్న స్వామి వద్దకు వెళ్ళి వచ్చి స్వామి నన్నొక్కడినే పిలుస్తున్నారని తను లోపలికి వెళ్లి లైటు వేయగానే నన్ను రమ్మనిచెప్పి రాధాకృష్ణమూర్తిగారు లోపలకు వెళ్ళారు. కాని 20 ని॥లు దాటినా లైటు వెలగలేదు. మాస్టరుగారి ఆదేశమయితే దర్శనమదే అవుతుందని తలచాను. అయినప్పటికీ తీవ్రమయిన ఆందోళనతో నిలబడే శక్తి కూడా లోపించి గోడకు ఆనుకొని ఒంటికాలిపై నుల్చొని నామస్మరణ మొదలుపెట్టాను. కొద్ది నిమిషాలలో లైటు వేసారు. నేను లోపలికి వెళ్ళి, కొద్ది క్షణాలు స్వామిని కన్నులారా చూచి, వారికి దగ్గరగా కూర్చున్నాను. మాస్టరుగారు సమర్పించమన్న పుస్తకాలు నివేదించగా స్వామి "వాటిపైన ఏమి వ్రాసారు?" అన్నారు. నేను వాటిపై మాస్టరుగారు వ్రాసిన వాక్యాలు చదివాను. స్వామి, "అన్నింటిపైనా ఇలానే వ్రాసారా?" అన్నారు. "అవును" అన్నాను. వాటిని ఒకసారి తిరుగవేసి తమ ప్రక్కన పెట్టుకొని నావైపు చూడగానే వారిని మాస్టరు గారు అడగమన్న కొన్ని విషయాలు విని సైగల ద్వారా అన్నింటికి సమాధానమిచ్చారు. తర్వాత నేను కొన్ని స్వవిషయాలు చెప్పబోగా స్వామి, "అన్నిటికీ నేనున్నాను, భయంలేదు" అన్నట్లు అభయమిచ్చి ప్రక్కనున్న రాధాకృష్ణమూర్తిగారితో నెమ్మదిగా ఏమో చెప్పారు. వారు నాకు ఫలమో, పుష్పమో ఇస్తారని తలచి నామస్మరణ చేస్తూ కూర్చున్నాను. ఇంతలో రాధాకృష్ణ మూర్తిగారు క్రొత్త వస్త్రాలు తెచ్చి ఇవ్వగా స్వామివాటిని తీసుకొని నా భుజాలపై పంచె కప్పారు. వెంటనే నాకేమీ తెలవకుండాపోయి వారి పాదాలు పట్టుకొని దత్తనామ స్మరణ చేస్తూ తన్మయుడనైనాను. స్వామి నా గడ్డం క్రింద చేయి వేసి పైకి లేపి ఒక క్రొత్త తువ్వాలతో నాతలపై రుద్దే సరికి నాకు నెమ్మదిగా మామూలు స్పృహ కల్గింది. అప్పుడు ఆయన నన్ను పుణికి పుచ్చుకొని నానుదుట తమ కుడి బొటనవ్రేలితో గట్టిగానొక్కి కుంకుమ బొట్టు పెట్టారు. ఆ స్పర్శకు నా శరీరమంతా ఒణికిపోతూ, నా కళ్ళవెంట నీరుకారిపోతున్నది. వారికి మరల నమస్కరించి వర్ణించ సాధ్యంగాని తన్మయంలో కూర్చున్నాను. ఇంతలో కుటీరం వెలుపల నా భార్య వేచియున్నదని చెప్పబోగానే స్వామి వారు తమ దోసిలినిండా కనకాంబరాలు నా చేతిలో పోసి ఆమెకివ్వమని సైగ చేసారు. ఆ తన్మయంలో నేను తూలిపోతుంటే రాధా కృష్ణమూర్తిగారు నా భుజాలపై చేతులు వేసి గది బయటకు తీసుకు వెళుతున్నా నాకేమీ తెలియడం లేదు. నేను బయటకు వచ్చినప్పుడు నా మెడలో స్వామివారు ప్రసాదించిన పంచ వారు నా తలపై నుంచిన తువ్వాలు నుదట పొడుగాటి కుంకుమ బొట్టు, దోసిల నిండా కనకాంబరములు పట్టుకొని వున్నప్పుడు నా ముఖంలో దివ్యమయిన వర్చస్సు నిండి వున్నదని మా వాళ్లంతా అన్నారు. తర్వాత నేను ఆశ్రమంలోని గురుస్థానంలో నమస్కరించుకుంటుండగా మరలా రాధాకృష్ణమూర్తి గారొచ్చి "స్వామివారు మిమ్మల్ని ఇక్కడ భోజనం చేసి వెళ్ళమన్నారు" అని చెప్పమన్నారు.

శివరాత్రి వెళ్ళిన గురువారంనాడు నేను సెలవు తీసుకోడానికి స్వామి ఆశ్రమానికి వెళ్ళాను. మరలా స్వామి వారు నన్ను పిలిపించి నేనేమి చెప్పకముందే, "అన్నింటికి మా అనుగ్రహం వున్నది, నీవు వెళ్ళిరావచ్చు" అని సైగచేశారు. నేను బయటకు వచ్చాక రాధాకృష్ణమూర్తిగారు "మొన్న మీరు వచ్చి వెళ్ళాక స్వామివారు భరద్వాజ మాస్టరుగారు గురించి ఎన్నో విషయాలు చెప్పారు. అయితే అవన్నీ బయటకు చెప్పేవిగావు" అన్నారు. ఇదంతా సాయి దయ అనుకున్నాము.



ఆచార్యుని అద్భుత లీలలు

శ్రీమతి సరోజిని, బాపట్ల

పూజ్యశ్రీ భరద్వాజ్ మహరాజ్ బాపట్ల వాస్తవ్యులు శ్రీమతి సరోజినిగారు ఈవిధంగా తెలియచేస్తున్నారు.

చాలా చిత్రమైన పరిస్థితులలో పూజ్యశ్రీ మాస్టరుగారు నా జీవితంలో ప్రవేశించారు. 2003 వ సంవత్సరంలో మా మేనమామగారితో నాకు వివాహం అయ్యింది. అయితే నా వివాహ విషయంలో కుటుంబంలో బాగా చర్చలయ్యాయి. మా అమ్మ తమ్ముడిని యిచ్చి చెయ్యాలని ఒకవైపువాళ్ళు, మా నాన్న వైపు యిచ్చి చెయ్యాలని యింకొకవైపువాళ్ళు....ఇలా గొడవలు జరిగాయి. ఒకరోజు, ఎందుకిలా జరుగుతోందని బాధపడుతూ నిద్రపోయాను. ఆరోజు నాకొక స్వప్నం వచ్చింది. అందులో, గళ్ళ లుంగీ, ఖద్దరు చొక్కా వేసుకున్న ఒకాయన నాతల నిమురుతూ, "నీకు మీ అమ్మగారి వైపు సంబంధమే అవుతుందమ్మా" అని చెప్పారు. ఇంతకుముందు ఎప్పుడూ అలాంటివారిని చూడలేదు. ఆయనెవరో అర్థం కాలేదు. కొన్నాళ్ళకి మర్చిపోయాను కూడా! ఆ తరువాత మా మేనమామగారితోనే నాకు వివాహం అయ్యింది. మావారు పెళ్లికాక ముందు, ఏదో పని వుండి ఒంగోలు వెళ్లారట. అక్కడ బాబాగుడికి వెడితే, వెనక సమాధి మందిరం చూశారట. గుడిలో సమాధి వుందంటే, వీరెవరో చాలా మహిమ గలవారు అయివుంటారు అనుకున్నారట. ఇప్పుడు ఆలోచిస్తే, వారి ప్రణాళిక ప్రకారమే మాకు పెళ్లి జరిగింది అనిపిస్తుంది. మేము బాపట్లలో కాపురం పెట్టాము. మావారు తాపీమేస్త్రి పని చేస్తారు. మేము వేణుగోపాలరావు గారింట్లో అద్దెకు వుండేవాళ్ళం. వారు కోటేశ్వరావుగారి దగ్గర జరిగే సత్సంగాలకి వెడుతూవుండేవారు. మమ్మల్ని కూడా రమ్మని చెబుతూ వుండేవారు. కానీ వెళ్ళేవాళ్ళం కాదు. దాదాపు రెండు సంవత్సరాలయ్యాక ఒక రోజు నేను కూడా సత్సంగానికి వెళ్లాను. అక్కడకి వెడుతూనే, పూజ్యశ్రీ మాస్టరుగారి ఫోటో చూసి నిర్ఘాంతపోయాను. నా పెళ్లికాక ముందు నా కలలో కనిపించినది ఈయనే అని గుర్తుపట్టాను. ఆరోజు నించి మా జీవితమే మారిపోయింది. అంతేకాదు, నాకు రెండు సంవత్సరములనించి వున్న మైగ్రెన్ తలనొప్పి ఆరోజుతో మాయమైపోయింది. కోటేశ్వరరావుగారి ఇంట్లో సత్సంగాలకు హాజరవుతూ, మాకు వీలైన సేవలు చేసుకుంటున్నాము. సొంతఇల్లు కూడా కట్టుకున్నాము.

2007 వ సంవత్సరములో కోటేశ్వరరావు అంకుల్ మా సత్సంగంలో దీక్షలు మొదలు పెట్టారు. అక్టోబరు 1వ తేదీ నించి అంటే పూజ్యశ్రీ అమ్మగారి పుట్టినరోజు నించి, అక్టోబర్ 30వ తేదీ అంటే పూజ్యశ్రీ మాస్టరుగారి పుట్టినరోజు వరకు, దీక్షలు వుంటాయి. అందులో భాగంగా ఖాళీ వున్నవారు నామంచెప్తూ బియ్యం ఏరేవాళ్ళం. దీక్ష చివరలో అలా ఏరిన బియ్యంతో బాబాగుడిలో ధుని మీద పాయసం వండి, పిల్లలు లేని వారిని పిలిచి ప్రసాదం పెట్టారు. అప్పుడు 14 మంది తీసుకున్నారు. నాకు అప్పటికి పెళ్ళయ్యి 4 సంవత్సరములయినా యింకా సంతానంలేని కారణంగా, నేనూ ప్రసాదం తీసుకున్నాను. తరువాత నాకు బాబు పుట్టాడు. 2010 లో మాకు పాప పుట్టింది.

మా పాపకి రెండున్నర సంవత్సరములున్నప్పుడు ఒక అనుభవం జరిగింది. మేము ఒకసారి ఇంట్లో సత్సంగం పెట్టుకున్నాము. సత్సంగానికి అందరం కోటేశ్వరరావు అంకుల్ ఇంటి నుంచి పటాలు

తెచ్చుకుంటాము. మర్నాడు నివేదన పెట్టి పూజ్యశ్రీ అమ్మగారిని, మాస్టరుగారిని (పటాలని) కోటేశ్వరరావు అంకుల్ ఇంటికి పంపించాలి. నివేదనకు నేను వంట చేస్తున్నాను. మా పాప బయటనించి పరిగెత్తుకుంటూ వచ్చి, పటాలున్న చోటికి రాగానే ఒక్కసారిగా ఎవరో పిలిచినట్లు ఆగిపోయి, నా దగ్గరకి వచ్చి, "అమ్మా, వాళ్ళకి అన్నం పెట్టు" అంది. తనని వాళ్ళు అలా అడిగారట. మా ఇంట్లో వరసగా 3 గదులుంటాయి. నాకు వంటింట్లోకి యిదంతా కనిపిస్తూనే వుంది. మా పాప యిలా చెప్పగానే నాకు చాలా ఆశ్చర్యం వేసింది. మా పాప యెంత అదృష్టవంతురాలో అనుకున్నాను.

ఇంకొకసారి ఈ పాపకే 5 సంవత్సరాలప్పుడు, ఒక ప్రమాదం జరిగింది. ఒకరోజు ఉదయం నేను, మావారు సత్సంగానికి వెడుతూ మా పాపని ఇంట్లో మా అమ్మ దగ్గర వదిలి వెళ్లాం. తను ఆడుకుంటూ మేడమెట్లు ఎక్కుతుండగా ఒకవైపున రైలింగ్ కి వున్న డిజైన్ ఊడిపోయి, పాప కింద పడిపోయింది. నిజానికి చాలా పెద్ద ప్రమాదమే జరిగి వుండాలి. కానీ చేతికి దెబ్బ తగిలి నొప్పిగా వుందని మాత్రమే చెప్పింది. అయినా x-ray తీయించుదామని డాక్టర్ దగ్గరకు తీసుకెళ్ళాం. అక్కడ ఇంకా ఒక గంట సమయం పడుతుందని చెప్పారు. మాపాప పెద్దగా ఏడవటం లేదు. చేతికి ఏదైనా అయితే పాప యిలా వుండదని చెప్పారు. మాకు అప్పుడు మళ్ళీ సత్సంగం వుంది. ఇంటికి తీసుకెళ్లిపోయి సత్సంగం నించి వచ్చాక చూద్దామని చెప్పి వెనక్కి వచ్చేసాము. ఆరోజు రాత్రి పూజ్యశ్రీ మాస్టరుగారు కలలో కొచ్చారు. మా ఇల్లంతా తిరుగుతూ వున్నారు. మావారు పూజ్యశ్రీ మాస్టరుగారికి పక్క వేసి పడుకోమన్నారు. అప్పుడు మాస్టరుగారు, "నేను, మంగ (పూజ్యశ్రీ అమ్మగారు) తెల్లవారుఝామున ఒక పెళ్ళికి వెళ్ళాలి, అందుకని పడుకోను" అని చెప్పారు. ఇంతట్లో మెలకువ వచ్చింది. మర్నాడు పాపని ఒక RMP డాక్టర్ దగ్గరికి తీసుకెళ్లాం. పాపకి పెద్ద ప్రమాదం ఏమి జరగలేదు. కొద్దిగా బెణికింది అనిచెప్పి, ఒక ఇంజక్షన్ చేసి, ఆయింట్మెంట్ ఇచ్చి పంపించేశారు. ఈ సంఘటన చూసిన వాళ్లకి పాపకి ఏమికాక పోవడం ఆశ్చర్యానికి గురిచేసింది. మాకు ఆ ముందు రోజు వచ్చిన స్వప్నాన్ని బట్టి, పూజ్యశ్రీ మాస్టరుగారు ఈరకంగా సరిచేయడానికి, మాఇల్లంతా కలయ తిరిగారని అనిపించింది.

ఇంకొకసారి మా బాబుని కూడా ఇలాగే కాపాడారు. ఒక ఆదివారం మా ఇంట్లో సత్సంగం అనగా, శనివారం రాత్రి పూజ్యశ్రీ మాస్టరుగారు కలలో కొచ్చి, మా ఇంట్లో ఒక మూల హారతి యిచ్చారు. దాని అర్థమేమిటా అనుకున్నాము. మర్నాడు మాబాబుకి స్నానం చేయించి ఒళ్ళు తుడుద్దామనుకుంటుంటే, ఆ తడి చేతితోనే, స్విచ్ బోర్డున వున్న త్రిపిన్ ప్లగ్ పట్టుకుని, వెంటనే చెయ్యి వెనక్కు లాగేసుకున్నాడు. 'ఎంత పెద్దప్రమాదం తప్పిందో!' అనుకున్నాను. వెంటనే పూజ్యశ్రీ మాస్టరుగారు ముందురోజు మా ఇంట్లో హారతి యిచ్చినది గుర్తుకొచ్చింది. ప్రమాదం తప్పలేదు, తప్పించారు అనిపించింది. ఈ రకంగా ప్రతిక్షణం మావెంట వుండి కాపాడుతున్న పూజ్యశ్రీ మాస్టరుగారికి కోటి కోటి ప్రణామములు!

ఒకసారి మేము సత్సంగంలో పూజ్యశ్రీ మాస్టరుగారికి, అమ్మగారికి వస్త్రాలు సమర్పించుకున్నాము (అలా సమర్పించుకున్న వస్త్రాలు తరవాత ఎవరైనా పేదవాళ్ళకి పంచేస్తాము). అప్పుడు మా అమ్మ మా ఇంట్లో వున్నారు. ఇది చూసి, "మీకు అంతంత మాత్రం సంపాదన, ఇలా ఖర్చులు పెట్టుకుంటే ఎలాగ? పిల్లలు చిన్నవాళ్ళు, చాలా అవసరాలు వుంటాయి" అని అన్నది. నేను ఆ గురుదంపతులు మమ్మెంతగా కాపాడుతున్నారో, ఇంతటి సంపాదనలో కూడా మేమెంత తృప్తిగావుంటున్నామో యివన్నిచెప్పినా ఆమెకి అర్థం కాదని, "అమ్మా ఒకసారి 'భగవాన్ భరద్వాజ' గ్రంథం చదువు, ఎన్నాళ్ళు పట్టినా ఫరవాలేదు, తరవాత నీకే ఆయనెంతటి వారో అర్థమవుతుంది" అని ఆ గ్రంథం యిచ్చాను. దానితో పాటు పూజ్యశ్రీ అమ్మగారు మాస్టరుగారు వున్న పటం ఒకటి యిచ్చాను. మా అమ్మ ఇంటికివెళ్ళి, పూజ్యశ్రీ అమ్మగారి మాస్టరుగారి ఫోటో ముందు కూర్చుని పారాయణ చేద్దామనుకునేసరికి ఆ పటం లోనించి అమ్మగారు ఒక నిముషం కనిపించి మాయమై పోయారట, మాస్టరుగారు వెంకటేశ్వర స్వామిలాగా కనిపించి అదృశ్యమయ్యారట. తిరుపతిలో కూడా ఇంతబాగా ఎప్పుడూ దర్శనం అవ్వలేదని చెప్పింది. మా అమ్మకి అంతగా చదవడం రాదు. చాలా సమయం తీసుకుంటుంది. కానీ ఈ గ్రంథం చదవడం మొదలుపెట్టిన మూడు రోజులకే పూర్తి చేసేసింది.

తనకే ఆశ్చర్యం వేసిందిట, ఎలా చదవగలిగానా అని. "గ్రంథం మొదలు పెట్టాక ఆపబుద్ధి కాలేదు. వారెంత గొప్పవారో అర్ధమయ్యింది" అని చెప్పింది. అప్పటినించి పూజ్యశ్రీ మాస్టరుగారంటే ఆమెకు చాలా ఇష్టం.

మా నాన్నగారికి ఈమధ్య కరోనా వచ్చింది. మా నాన్నగారు ఆర్మీలో ఉద్యోగం చేస్తారు. ఆఫీస్ లో చాలా మందికి వచ్చింది. నాన్నగారు ఆసుపత్రిలో జాయిన్ అయ్యారు. ఒకరోజు మాస్టరుగారు స్వప్నదర్శనం యిచ్చారు. అందులో మాస్టరుగారు, మా నాన్న వున్న ఆసుపత్రికి వెళ్లారు. బాపట్ల సత్సంగం వాళ్ళని కూడా రమ్మన్నారు. మేమందరం వెళ్లాం. నేను మా నాన్న వున్న దగ్గరకి వెళ్లి పలకరించాను. అప్పుడు నేను మా నాన్న తో "పూజ్యశ్రీ మాస్టరుగారు వచ్చారు, ఇక్కడ సత్సంగం చేస్తారు" అని చెప్పాను. అప్పుడు సమయం రాత్రి ఎనిమిది గంటలు అయ్యింది. అప్పుడు మా నాన్న, "ఇది ఆసుపత్రి కదమ్మా,, అందరూ పడుకుంటారు, తొందరగా వెళ్లిపోండి" అని చెప్పారు. పూజ్యశ్రీ మాస్టరుగారు, ఒక గదిలో కూర్చుని, అక్కడున్న నర్సుని పిలిచి, ఇక్కడ వున్న కరోనా బాధితులందరికీ ఏయే మందులు ఇవ్వాలి, ఎలాంటి ఆహారం యివ్వాలి, అన్నీ వివరించి చెప్పారు. కల ముగిసింది. మా నాన్నగారు చాలా తొందరలోనే ఆరోగ్యవంతులై బైటికి వచ్చారు. ఆయన "నాకు ఇంత షుగర్ వున్నా అస్సలు నీరసం అనిపించలేదు. నాకేనా కరోనా వచ్చింది అన్నంత ఆశ్చర్యంగా వుంది" అని అంటారు. ఇదంతా పూజ్యశ్రీ మాస్టరుగారి దయ అని వేరే చెప్పనవసరం లేదు.

ఒకసారి మావారు పూజ్యశ్రీ బాబా, మాస్టరుగారి విగ్రహాలకు అభిషేకం చేయాలని, ముందుగా వాటిని శుభ్రం చేసుకుని అలంకరిస్తున్నారట. (నేను, పిల్లలు ఊరికి వెళ్లాం). ఈలోగా ఫోను వచ్చింది. సాధారణంగా అలాంటి సమయంలో నామస్మరణ చేసుకుంటూ వుంటారు. కానీ ఆరోజు ఫోన్ తీసి, పైగా అక్కడే కూర్చుని కొంచం గట్టిగానే మాట్లాడుతున్నారట. వెంటనే పూజ్యశ్రీ మాస్టరుగారి విగ్రహం నించి, "ఏయ్ పోతురాజు" అనిగట్టిగా గదమాయించినట్లు మాటలు వినిపించాయట! వెంటనే తప్పు జరిగినందుకు క్షమించమని అడిగారట., పూజ్యశ్రీ మాస్టరుగారు అంతలా కనిపెట్టుకుని వున్నందుకు చాలా ఆనందం వేసిందట!!

కొన్నిరోజుల క్రితం నాకు బాగా కడుపులో నొప్పి వచ్చింది. కారణం తెలియలేదు. ఒకరోజు రాత్రి పూజ్యశ్రీ మాస్టరుగారు, నా కలలో, "ఎక్కువ తినొద్దు, ఎక్కువ తినొద్దు" అని రెండుసార్లు చెప్పారు. తరవాత అర్ధమయ్యింది, ఆ వారంలో యించుమించు ప్రతిరోజూ కందిపప్పు ఎక్కువగా వాడకం జరిగిందని. ఇక అప్పటి నించి చాలా తక్కువగా వాడుతున్నాను. నా కడుపు నొప్పి కూడా తగ్గిపోయింది.

ఇలాంటి చిన్న విషయాలనించి, మా జీవితాలనే మార్చేసే పెద్ద విషయాల వరకు పూజ్యశ్రీ మాస్టరుగారు మా వెంటవుండి నడిపిస్తున్నారు. మనలోనే, మనతోనే వుంటూ, ఏమీ తెలియని మా జీవితాలని నడిపిస్తూ, మాకు యింతటి అదృష్టాన్ని కలిగించిన ఆ మహాపురుషునికి కృతజ్ఞతాపూర్వక పా దా భి వం ద న ము లు తెలియచేసుకుంటూ, మా జీవితాంతం వరకు వారి సన్నిధి భాగ్యాన్ని ప్రసాదించమని వేడుకుంటున్నాను. ●

పరిప్రశ్న

06వ పేజీ తరువాయి

గుర్తిస్తే అక్కడే ఉంటారు. అట్టివారినే దిగంబరులంటారు. వారి భౌతిక శరీరము నశించినంతమాత్రాన వారి ఉనికికి భంగముండదు. కనుక దిగంబరుడంటే సర్వగతుడూ, ఎక్కడ స్మరిస్తే, గుర్తిస్తే అక్కడనే వున్నవాడు అని అర్థము. ఎప్పుడు ఎక్కడ దేనిని గుర్తించినా గుర్తింపు జరిగేది మన హృదయంలోనే! అక్కడ గూడ ఆ దిగంబరుడే వుంటాడు. కనుక దిగంబరుడంటే సర్వభూత హృదయగతుడు అని గూడ అర్థం. అసంఖ్యాకమైన సాయి లీలలన్నీ ఈ నామాన్ని సార్థకం చేసేవే గనుక సాయి దిగంబరుడు కాకుంటే యిక దిగంబరియనదగిన వారే లేరు.

ఇది తెలియక పరిపూర్ణమైన మహాత్ములుగా గుర్తింపబడి పూజింపబడాలని కోరేవారుగూడ, వివస్త్రులై సంచరిస్తే అట్టివారు బాహ్యదృష్టికి దిగంబరుల్లా కనిపించినా నరరూపంలో సంచరించే పశుపక్ష్యాదులే సుమా!

పరమ పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టరుగారిచే రచించబడిన అపూర్వ ఆధ్యాత్మిక వైజ్ఞానిక గ్రంథములు

SRI GURUPADUKA PUBLICATIONS, C/o.SRI MANGA BHARADWAJA TRUST

Regd.Office: Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar, Jaipuri Colony, Nagole, Hyderabad-68.

Phone: +91 - 74160 41550

Branch Office : Kondaiah Bunk Street, Kothapeta, Ongole, Prakasam Dist. Andhra Pradesh.

Phone:08592 233271

Send DD in favour of **"Sri Manga Bharadwaja Trust (Publications)", payable at Hyderabad or Ongole.**

శ్రీ సాయి లీలామృతం-శ్రీ గురు చరిత్ర (Bound)	450-00
శ్రీ సాయి లీలామృతం	99-00
శ్రీ గురు చరిత్ర	99-00
శ్రీ సాయి సన్నిధి	120-00
శ్రీ సాయి మాస్టర్ ప్రవచనములు	125-00
శ్రీ సాయినాథ ప్రభోధామృతము	80-00
సాయినాథ పూజ	40-00
సాయినాథ స్తవనమంజరి	10-00
శిరిడి ఆరతులు	15-00
సాయిబాబాను సేవించడమెందుకు	10-00
సత్సంగము - భజన	5-00
శిరిడి క్షేత్ర సందర్శనము	40-00
విజ్ఞాన వీచికలు	99-00
పరిప్రశ్న	99-00
మతమెందుకు?	20-00
ఏది నిజం?	25-00
ధ్యానయోగ సర్వస్వం	99-00
బుద్ధధ్యాన హృదయం	49-00
దత్తావతార మహత్త్వం	75-00
సంహితాయన గురు ద్విసాహస్రి	125-00
పురుషసూక్త రహస్యం	40-00
సాయిసూక్తి - ఆచార్యవాణి	10-00
శ్రీ పాకలపాటి గురువుగారు	49-00
అవధూత శ్రీ చీరాలస్వామి	49-00
అవధూత శ్రీ వెంకయ్యస్వామి	70-00
శ్రీ ఆనందమాయి అమ్మ	49-00
టిబెట్ యోగి మిలారేపా చరిత్ర	80-00
శ్రీ హజరత్ తాజుద్దీన్ బాబా చరిత్ర	49-00
స్వామి సమర్థ (అక్కల్కోట స్వామి)	49-00
మనము - మన సంస్కృతి	70-00

ఇతర ప్రచురణలు

మహాత్ముల ముద్దుబిడ్డడు	120-00
అవధూత చివటం అమ్మ	70-00
శ్రీ సిద్ధారూఢ స్వామి చరిత్ర	70-00
శ్రీ సాయి మాస్టర్ స్మృతులు - పార్ట్-1	125-00
మరో నందదీపం	80-00
ఆచార్య అమృత లేఖావళి	40-00
భగవాన్ శ్రీ భరద్వాజ	175-00
బాలల శ్రీ సాయి లీలామృతము	25-00
మహాపురుషుడు	50-00
శ్రీ సాయి మాస్టర్ స్మృతులు - పార్ట్-2	125-00
బాలల శ్రీ సాయి సన్నిధి	50-00
బాలల శ్రీ గురు చరిత్ర	50-00
శ్రీ సాయి మాస్టర్ నిత్యసత్య వ్రతము	15-00
మాష్టారు అమృత వాక్కులు	100-00

BOOKS IN ENGLISH

Sai Baba the Master	175-00
Sree Guru Charitra	99-00
Supreme Master (Swami Samartha)	99-00
Sai Baba of Shiridi and His Teachings	99-00
Life and Teachings of Hazarat Tajuddin Baba	99-00
Children's Sai Baba the Master	60-00

BOOKS IN OTHER LANGUAGES

Sadguru Sai Baba (Hindi)	150-00
Sai Leelamrutham (Kannada)	150-00
Sai Baba Jeevitha Charitham (Malayalam)	220-00
Sai Baba Leelamrutham (Tamil)	175-00
Sri Guru Charitra (Hindi)	99-00
Swami Samartha (Kannada)	50-00
Sri Guru Charitra (Kannada)	99-00
Shiridi Aarathi (Tamil)	15-00
Stavana Manjari (Tamil)	10-00
Tibet Yogi Milarepa Jeevitha Charitra (Kannada)	55-00
Sri Sainath Prabodhamruthamu (Kannada)	65-00
Sai Sannidhi (Kannada)	120-00
Sri Guru Charitra (Malayalam)	150-00
Sri Guru Charitra (Oriya)	150-00



'శ్రీ సాయిలీలామృతము'

మహాగ్రంథ కృతజ్ఞతార్చన మహోత్సవము

08TH MAY, 2022

Date of Publication: 21st of each month. Permitted to post: 23rd, 24th, 25th and 26th of each month.
Edited, Printed and Published by Dr. R.S. Sasidhar, Ph.D. trustee of Sri Manga Bharadwaja Trust,
Ongole - 523002. Postal Registration Number : Prakasam/16/2021-2023, Regd.No. 37926/83.

ఏప్రిల్ 12, 2022న పూజ్యశ్రీ భరద్వాజ మాస్టరుగారి ఆరాధన మహోత్సవము
గుమ్మళంపాడు మాతృదేవి దివ్యసన్నిధిలో ఘనంగా జరిగింది

IF UNDELIVERED, PLEASE RETURN TO: SRI MANGA BHARADWAJA TRUST, KONDAIAH BUNK STREET,
KOTHAPETA, ONGOLE, PRAKASAM DT., A.P. - 523002.